# మిసిమి

మాస పత్రిక

ఆగష్టు - 1998

వెల - రూ॥ 8/-



# ముఖచిత్రం



జాన్ సింగర్ సార్జెంట్ (1856-1925)

**చిత్రకారుని గురించి :**

ఇతడు ఫ్లొరెన్స్‌లో జన్మించాడు. బాల్యం అంతా ఒక నగరం నుంచి మరో నగరానికి మారటంతోనే సరిపోయింది. అతడి కళాధ్యయనం పారిస్‌లో జరిగింది. వాస్తవిక, సాంప్రదాయిక శైలిలో చిత్ర లేఖనం సాగించాడు. ముద్రావాదం (impressionism) తో కూడ ప్రభావితుడు కాకపోలేదు. అతడు ముఖ్యంగా అమెరికా, ఇంగ్లాండులలో బాగా ప్రసిద్ధి చెందాడు. మనుషులను, మనుషుల ముఖాల వర్ణ చిత్రాలు వేయడంలో చేయితిరిగిన వాడు. వీటిపై భ్రాంతి కోల్పోయిన అతడు కుడ్య, హర్మ్య ఉపరితలాలపై చిత్రలేఖించడం మొదలు పెట్టాడు. స్థల దృశ్యాలను తైల, జల వర్ణాలతో చిత్రించాడు. అతడు అవివాహితుడే అయినా, కుటుంబం అన్నా, స్నేహితులన్నా అతనికి అభిమానం.

**చిత్రం గురించి :**

**కులీన మహిళ ఆగ్న్యూ (1892-3)**

1893లో లండన్‌లో రాయల్ అకాడమీ ప్రదర్శనలో అత్యంతంగా ప్రశంసలనందుకొన్న ఆహ్లాదకర, మనోజ్ఞమైన రంగుల చిత్ర లేఖనం ఇది. ఈ చిత్రం చూడగానే మనలో లేచిపడే ఉత్సుకతను, ఉత్తేజాన్ని, ఆసక్తిని తేలికగా అర్థం చేసుకోవచ్చు. ఎలాగంటే, ఆమె స్నిగ్ధ, కోమల, మందచలన సౌందర్యంతో ఈ చిత్రం నిండి నిబిడీకృతమై ఉంది. అంతేకాదు, ఎలా తెలాపోయిన అరుణ నీలిమ వర్ణఛాయల సమవాయంతో, కొట్టవచ్చినట్లు కనిపించే నైపుణ్యంతో, సారళ్యంతో, ఆమె దుస్తుల ధావళ్యంతో ఉన్న ఈ చిత్రం సార్జెంట్ చిత్రించిన చిత్రాలలో కెల్ల అత్యంత సుందరమైంది.

# మిసిమి

"All that we are is the product of what we have thought" is "We are what we think." — Dammapada.

సంపుటి 10 | ఆగష్టు 1998 | సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : డాక్టర్ **రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయసూచిక

సాహిత్యం - సామాజిక ప్రయోజనం - సురేష్ కుమార్

సూత పురాణంలో శ్రీకృష్ణుడు - రావెల సాంబశివరావు

కవిత్వము - సౌందర్యము - డా. యు.ఎ. నరసింహమూర్తి

మిర్జాగాలిబు వ్యక్తిత్వం - సదాశివ

స్వామి వివేకానందతో ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు - టి. రవిచంద్

రససృష్టిలో మోహం - కొండపర్తి శేషగిరిరావు

చిరస్మరణీయమైన సినారె కవిత - గోపాని రవీందర్

న్యూట్రినోలకు ద్రవ్యరాశి - నాగసూరి వేణుగోపాల్

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/-

ముఖచిత్రం : **కులీన మహిళ ఆగ్నూ**

**Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd., 1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd-20. Ph. 7645536**

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# Are you your own worst enemy?

**LIFESTYLE**

**Here is the chance to find out whether you are the sort of person you could really get to like. Answer these telling questions and see yourself as others see you**

If you don't really like yourself, nobody will, either. No one loves a loser. But if you would like to be friends with someone like you, other people's criticism will just bounce off. For you know how likeable you really are. So are you your own best friend —or worst enemy? Go ahead and learn the honest truth about yourself.

1. Are you happy:
(a) all or most of the time (b) sometimes (c) rarely (d) never?

2. What do you think would do most to make you happier that you are now:
(a) having more money (b) different people in your life
(c) change of job to something you would enjoy more (d) better health?

3. Do you bear a grudge:
(a) often and tenaciously (b) often, but not for long
(c) only once in a while (d) rarely and then, only briefly?

4. If you have done something particularly well, do you get most pleasure from:
(a) the satisfaction you get from it yourself
(b) the acknowledgment others give you
(c) being one up on somebody else
(d) you can't remember when you last felt you had done something particularly well?

5. How many of these faults do you think you have ?
* self - centred * selfish * careless of the feelings of others * lazy
* bad at handling money * deceitful * unreliable
(a) none or one (b) two or three (c) four or five (d) six or seven?

6. Which of these descriptions do you think fits you best :
(a) a wonderful person (b) a warm person(c) a worthwhile (d) a worthless person?

7. Do you recall your childhood with :
(a) warm feelings (b) regrets that it is past
(c) regrets that it was not different (d) the shudders?

8. When you make a mistake, do you :
(a) forget it five minutes later (b) analyse it for what you can learn from it and then put it out of your mind (c) keep going over and over how it happened (d) keep going over and over how stupid you feel to have made it?

9. Do you think falling in love as :
(a) fulfilling you (b) completing you (c) making you happier (d) threatening you?

10. Do you think the best time of your life is :
(a) over (b) now (c) to come ?

11. If you and your partner fancy different places in the holiday brochure, do you :
(a) go where your partner wants to go (b) go where you want (c) sometimes one, sometimes the other (d) holiday separately?

continued on last page (608)

# సాహిత్యం - సామాజిక ప్రయోజనం

## 1967 నోబెల్ పురస్కార స్వీకారోపన్యాసం

మూలం : ఆస్టురియస్ అనువాదం : సురేష్ కుమార్

కుటుంబ సభ్యుడు కావడము కష్టమేమి కాదు. కాని నోబెల్ పురస్కారగ్రహీతల కుటుంబ సభ్యుడిని కావడము, ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వారసుడిగా గుర్తింపు పొందడమనే ఈ క్షణాన నా గొంతు పెగలడం లేదు. ఈ ఆనందం వర్ణనాతీతం. జాతి, మత, వర్గ, వర్ణ విచక్షణ లేని సృజనాత్మకత కలిగిన మానవులందరిని ( రక్త సంబంధానికన్నా అతీతమైన బంధం కలిగిన) ఒక వసుధైక కుటుంబ సభ్యులుగా చూడాలన్న ఆల్‌ఫ్రెడ్ నోబెల్ ఆకాంక్షకు ప్రతిరూపమే ఈ పురస్కారము. ఈ రోజు ఈ ఉన్నతమైన కుటుంబములో నేనూ ఒక సభ్యుడిగా మారినందుకు నాకు ఆనందముగా ఉన్నది.

రచయిత సృజనాత్మకత, నిర్మాణాత్మకమైన కార్య సాధనకు ఉపయోగపడాలి. రచయిత కర్తవ్యం పాఠకుడిని ఆనందింపచేయటమే కాదు. సమాజం పట్ల తన బాధ్యతను గుర్తెరిగి సామాజిక రుగ్మతలను ప్రక్షాళన గావించగల రచనలు చేయాలి. మానవులలో గల అనంత శక్తిని వినాశకర కార్యాల కొరకు కాక నిర్మాణాత్మకమైన కార్య సాధనకై వినియోగించునట్లు తన రచనల ద్వారా రచయిత చేయగలగాలి.

ఆల్‌ఫ్రెడ్ నోబెల్ కృషి ఫలితమైన డైనమైట్ అతిశక్తివంతమైన ఆయుధం. ఈ ఆయుధం నిర్మాణాత్మకమైన మరియు వినాశకరమైన కార్యములకు వినియోగింపవచ్చును. దీనిని నిర్మాణాత్మకమైన కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా మానవుడు ఎన్నో అద్భుతాలను సాధించాడు. వినాశకర శక్తులను కూడ మానవాళి ప్రయోజనం కొరకు ఏ విధంగా ఉపయోగించుకోగలమో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ నిరూపించాడు. అదే విధంగా రచయిత రచన, మానవులలో పేరుకొని వున్న జాతి, మత, వర్గ, వర్ణ విచక్షణను వెలుగులోకి తెచ్చి, అక్షరాలనే తూణీరాలతో వాటిని అంతమొందించాలి.

జాతి వివక్ష కారణంగా మన నవలలు, రచనలు యూరోపియన్స్‌కి అసంబద్ధమైన అర్థ రహితమైన రచనలుగా కనిపించవచ్చు. దేశ, ఖండ విభేదాలు సమసిపోయి, జాతి, మత, వర్ణ విచక్షణలు అంతరించి మానవుడు సాటి మానవుడిని సహోదరుడిగా చూసే ఆశావంతమైన రోజులు రావాలని ఆకాంక్షిస్తున్నారు. మన దేశాలలో వ్యాపించిన యూరోపియన్ ఖండ విలువలను, సంఘర్షణలను అంతరింపచేసి మానవాళి ప్రయోజనాలే పరమావధిగా సాగే విధంగా మన రచనలు కొనసాగాలి.

ఈ కర్తవ్యంలో మనం మన అంతరాత్మను ప్రతిఫలింపచేసే ఒక నూతన భాషను వ్యాకరణాన్ని సృష్టించుకొన్నాం. దానికి వ్యాకరణ అడ్డంకులుండవు. భాషా బంధాలుండవు. భాషా సొగసులుండవు. మన ఆవేశాన్ని,ఆక్రోశాన్ని వినిపించే శక్తివంతమైన పదాలు మాత్రమే వుంటాయి. ఇవి జీవితాన్ని, జీవితము యొక్క వైరుధ్యాలను ప్రతిబింబిస్తాయి. మాటలను విషయమును తెలియచేయటం కోసం కాక విషయాన్ని తెలియచేయడం కోసం మాటలను వుపయోగిస్తున్నాము. భావపూరితమైనదే భాష. మా భాష మీద మీకున్న ఆసక్తిని విడనాడి మా భావోద్వేగాలను నిశితంగా పరిశీలించండి. మా ఈ నూతన పంథాను, భాషను గుర్తించండి. మానవాళి ప్రయోజన్నాన్ని ఆశించి సాగే ''వసుధైక కుటుంబ స్థాపన''కై మన మంతా ఒకటై కలిసి పయనిద్దాం.

''ఊహ'' అందమైంది. ఊహాజనిత ఆలోచనలు మన మనస్సులను రంజింపచేస్తాయి ''సత్యం'' అందమైన దాని కంటే బలమైంది. అది మన మనస్సులను రంజింప చేయడమే కాక ఆలోచింపచేస్తుంది. హృదయానుభూతులను స్పృశిస్తుంది. ప్రఖ్యాత ఆఫ్రికన్ నవలాకారుడు, విమర్శకుడు చినువా అబెబి అభిప్రాయపడినట్లు **"European writings are for the entertainment of mind whereas African writings are to move your heart and soul"** ఊహా కల్పితమైన కష్టాలను, అనుభవాలను వివరించే యూరోపియన్ రచయితల రచనల కన్నా వారి జీవితానుభవాలను ప్రతిఫలింపచేసే ఆఫ్రికన్ రచయితల రచనలు పాఠకులను ఆలోచింపచేస్తాయి. వారి ఆత్మానుభూతులను వివరిస్తాయి. ఈ రెండవ కోవకు చెందిన రచనలు చేసిన ప్రఖ్యాత లాటిన్ అమెరికా రచయిత మిగుడ్ ఏంజెల్ ఆస్టురియస్ 1899లో గ్వాటిమాలలో జన్మించెను. స్వదేశములోనే కళాశాల విద్యను అభ్యసించాడు. ''రెడ్ ఇండియన్స్ యొక్క సామాజిక సమస్యలు'' అనే అంశం మీద ఆస్టురియస్ వ్రాసిన సిద్ధాంత వ్యాసం 1923లో ప్రచురితమైంది.

స్వదేశంలో న్యాయ విద్య అభ్యాసానంతరము రాజకీయ అర్థశాస్త్రాల అధ్యయనం కోసం యూరోపుఖండ పర్యటన చేశాడు. యూరోపు ఖండ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాహిత్య స్థితి గతులను నిశితంగా పరిశీలించాడు **University of Sorbonne** లో ప్రొఫెసర్ జార్జ్‌రేనాడ్ **(Georges Raynoud)** ఉపన్యాసాలతో ప్రభావితుడై అతని శిష్యుడిగా మారి వివిధ రాజకీయ, సామాజిక సమస్యలపై గ్వాటిమాల, పాపులర్ యూనివర్శిటిలో ఉపన్యాసాలను ఇచ్చాడు. ఇతని ఉపన్యాసాలు **"Architecture of the New Life"** అనే ఉపన్యాస సంపుటిగా 1928లో ప్రచురింపబడి వివిధ భాషలలోకి అనువదింపబడి ప్రముఖుల మన్నన పొందింది.

ఇతని రచనలలోకెల్ల అత్యుత్తమైనటువంటి **"The President"** నవల ఎన్నో అడ్డంకులను దాటుకొని 1946లో ప్రచురింపబడింది. పది సంవత్సరాల (1923-1933) కష్ట ఫలితమే ఈ నవల. ఈ నవల ఇతివృత్తం ఆనాటి గ్వాటిమాల రాజకీయ స్థితిగతులను ఆనాటి గ్వాటిమాల ప్రెసిడెంట్, నియంత ''జార్జ్ యూఫికో'' నియంతృత్వాన్ని, సామాజిక రుగ్మతలను రెడ్ ఇండియన్స్ దుర్భర స్థితిగతులను, లంచగొండితనాన్ని నిశితంగా విమర్శించింది. 1933లోనే ఈ నవల పూర్తి అయినప్పటికి 1946 దాక ప్రచురణకు నోచుకోలేదు. 1944లో గ్వాటిమాల నియంత జార్జి యూఫికో పతనానంతరమే 1946 మెక్సికోలో ప్రచురింపబడింది. 1918నుండి 1948 మధ్య ఇతడు వ్రాసిన పద్యాలు **"Temple of the Lark"** అనే పద్య సంపుటిగా 1949లో ప్రచురింపబడ్డాయి. ఇతర రచనలలో ప్రముఖమైనవి **"Strong wind" (1950) "Mulata"(1962)**

ఇతని రచనాశైలిపై ఫ్రెంచి సర్రియలిజమ్ ప్రభావము అధికంగా ఉంది. గ్వాటిమాల ప్రజల ఆకాంక్షలకు, ఆశలకు ప్రతినిధి ఆస్టూరియస్. వారి ఆచార వ్యవహారములు, సామెతలు, నానుడులు, స్థానిక భాషా ప్రభావము ఇతని రచనలలో ప్రతిఫలిస్తుంటాయి. నియంతృత్వం, అన్యాయం, బానిసతనం, అసమాన సత్వాలకు గొడ్డలి పెట్టు ఇతని రచనలు. చిమ్మచీకటిలో కరదీపకవంటివి ఇతని రచనలు. భాషా సౌందర్యం ఇతని రచనలలో కనిపించదు. భాషా దోషాలు, వ్యాకరణ దోషాలుంటాయి కాని ఇతని రచనలలోని భావాలు, మాటలు పాఠకుల హృదయాలకు శరాఘాతాల వలె తగిలి, నిద్రిస్తున్న అతని భావాలను అవి తట్టి లేపుతాయి. వారి మనస్సులను ఆలోచింపచేస్తాయి. ఇతని సాహిత్య సేవలకు గుర్తింపుగా 9166లో **"Lenin Peace Prize"** 1967లో అత్యున్నత ''నోబెల్'' పురస్కారమూ లభించాయి.

# సూతపురాణంలో శ్రీకృష్ణుడు

(గత సంచిక తరువాయి) - రావెల సాంబశివరావు

తరువాత దాసిద్వారా రహస్యాలు తెలుసుకున్నాడు. అన్నతో సహా కంసుని సభలో అకస్మాత్తుగా ప్రవేశించాడు. నెమ్మదిగా మెలగినట్లే మెలగి ఖడ్గంతో కంసుని తల రెండు వక్కలయ్యేట్లు నరికాడు. తరువాత తాత ఉగ్రసేనుణ్ణి పేరుకు రాజునుచేసి పెత్తనం తాను చెలాయించసాగాడు.

కంసుని వధించటం వల్ల బలవంతులతో విరోధం పెరిగింది. ఎక్కువ మంది కంసుని మామ యగు జరాసంధుని పక్షాన నిలిచారు. అలా నిలిచిన వాళ్ళను ఒక్కొక్క వీరుణ్ణి విడగొట్టి చంపటం మొదలు పెట్టాడు. హంస డింబికుల్ని మాయోపాయంతో కూల్చాడు.

జరాసంధుడు అప్రమత్తుడై పలుమార్లు దండెత్తి శ్రీకృష్ణుని ఓడించటం జరిగింది. ఇంక మధురలో ప్రాణములు దక్కవని తెలిసి ద్వారవతి అనే జలదుర్గాన్ని కట్టించి కాపురమున్నాడు. అక్కడినుండి పన్నాగాలు పన్నసాగాడు. అయినా ఒకవైపునుండి ఏకలవ్యుడు, ఇంకొకవైపునుండి సాల్వుడు, వేరొక దిక్కు నుండి శిశుపాలుడు బెదిరిస్తూనే ఉన్నారు.

ఇటువంటి విషమస్థితిలో శ్రీకృష్ణునకు దిక్కుతోచలేదు. దరితెన్నుకానరాలేదు. ద్రావిడులలో ఒక్కడూ చేయూతనిచ్చువాడు కానరాడు. అందువల్ల శ్రీకృష్ణుడు భయభ్రాంతుడయ్యాడు. చకితుడయ్యాడు. జడుడయ్యాడు. పోనీ ఆర్యులలో ఒక వర్గం వైపు మొగ్గుదామంటే వాళ్ళకి పారా పొచ్చాలు లేవాయె. ఇక ఒక్కటే శరణ్యాం, అదే మంత్రం. మంత్ర సహాయంతో ఆర్యుల్ని చీలదీసి ఒక పక్షం కొమ్ముగాయాలి. కురుపాండవుల మధ్య విరోధాన్ని కల్పించాల్సిందే తప్పదు. ఇలా ఆలోచన చేయసాగాడు. మనస్సులోకి ఆలోచన రావాలేగాని యింక ఆగటమా!

అదనుచూచి జీతబత్తెములు లేని ఆనాటి టపా బంట్రోతు అయిన నారదుణ్ణి పిలిపించి అతని సహాయంతో ధర్మరాజు రాజ సూయానికి అంగీకరించేట్లు చేసాడు. జరాసంధుడు ఎదురు తిరిగాడు. పాండవులు శ్రీకృష్ణుణ్ణి ఆశ్రయించక తప్పింది కాదు. భీమార్జున కృష్ణులు ముగ్గురూ కుట్రపన్ని స్నాతక బ్రాహ్మణ వేషములతో గిరి వ్రజపురం చేరి అర్థరాత్రి రాజమందిరంలో జరాసంధుణ్ణి చంపారు. ఆ చంపటం ఏలా చంపారో చూడండి.

పిడికిడి పోటులం బొడిచి పెళ్కురి పోవగ్ర నజ్జు నజ్జు గాఁ
గడిమి చెడంగఁ బాదముల గట్టిగఁ దాకుచు గొంతుఁ బట్టుచున్
సుడిబడఁగ్రుమ్మి మర్మముల స్రుక్కఁగఁజేయుచు మూవురొక్కటై
మడియఁగఁజేయు కోర్కె మెయి మాగధుఁదాకిరి భీకరంబుగన్

''పడిన వానిఁ గృష్ణార్జునుల్ పట్టుకొనుచు
నదిమిపెట్టంగ భీముండు కదిసి కాలు
పట్టి ఫెళఫెళ రావంబు లుట్టిపడగ
జీల్చివైచె జరాసంధు శీర్ణదేహు.''

రాజ సూయం పూర్తిజేసారు. అగ్రపూజ విషయంలో వివాదం చెలరేగింది, శిశుపాలుడు ఎదురు తిరిగాడు -

సుక్షత్రియుడు కావాలనుకుంటే దుర్యోధనుడున్నాడు
ఆచార్య వర్యుడు కావాలనుకుంటే గంగా సుతుడున్నాడు
అందరికంటే వయస్సున పెద్ద కావాలంటే బాహ్లికుడున్నాడు
వేదవేత్త కావాలనుకుంటే ద్వైపాయనుడున్నాడు.

కులము, జాతి, గుణము లేని కృష్ణుణ్ణి పూజించటమేమిటి? మమ్మల్ని యిలా పిలిచి అవమానించటం దేనికని చిందులేసాడు. ఆగ్రహం పట్టలేక సభవిడిచి వెళ్ళేవాణ్ణి ధర్మరాజు బుజ్జగించి సభలో కూర్చుండబెట్టాడు. అయినా శిశుపాలుడు రుసరుసలాడుతూనే ఉన్నాడు. ఇదే అదనని కృష్ణుడు-

''ఎగుమూపున కున్ నేర్పునఁ
దగిలించిన యట్టి చక్రధారను శిరమున్
దెగిపడఁదటుకునఁ గృష్ణుడు
మొగిసి ప్రయోగించెఁ జక్రమును సభ చెదరన్

శిశుపాలుని వధకు మనస్తాపం చెందిన సాళ్వుడు ఇలా అనుకుంటాడు.

''ఎప్పుడు నిట్టివాఁడెయగు కృష్ణుఁడెఱుంగమె? జౌరవీనికిం
దప్పులు లేవు, లేదు రణధర్మము శూరకులంబు నందునన్
జొప్పుడఁబుట్టి యుండినను సుంత యెఱుంగఁడు శూరధర్మముల్
ముప్పొడఁ గూడు నిక్కముగ ముక్కున వీనికి నావి యున్నచో.''

తరువాత సాళ్వుడు యుద్ధం ప్రకటిస్తాడు. ఆరు మాసాలపాటు యెడతెగని యుద్ధం. ఇక్కడ సాళ్వులు, యాదవులు యిలా యుద్ధం చేస్తూంటే అక్కడ ధర్మరాజుగారేమో జూదం ఆడి రాజ్యాన్నీ, చివరకు ఆలినీ ఒడ్డి ఓడిన సంగతి మీకు తెలిసిందే. ఈ సాళ్వరాజును చంపటం ఎట్లాగో తెలియక దుఃఖంలో మునిగిన శ్రీకృష్ణుడు ఇంక అక్కడ ద్రౌపది మానం కాపాడే దెక్కడ?!

చిట్టచివరకు ఆరుమాసాల తరువాత సాళ్వున్ని కూల్చుతాడు, మరో ద్రావిడ ప్రభువు పౌండ్రక వాసుదేవుడు ఓసారి కృష్ణుణ్ణి యిలా నిలదీస్తాడు-

ఏమిరకృష్ణ! చిత్రములనేకముఁజేయుచు నుంటి వంట నా
నామము బూనినావఁట వినాశము నీ కిఁకఁదప్పఁబోదు పైఁ
గా మము ధిఃకరించుటకుఁగైకొని నావఁట శంఖ చక్రముల్
నీ మతి పోయేనే? బ్రదుక నేరవె? తీరని వైరమేటికిన్?

ఇద్దరూ యుద్ధానికి తలపడతారు. వారి పోరాటంచూచి ఉభయులూ సరికి సరి అంటూ వీరభటులు ఆశ్చర్యపడ్డారు. చివరికి ఒకరోజు కృష్ణుడు చక్రంతో పౌండ్రక వాసుదేవుని తలనరకనే నరికాడు.

ఇలా తనదైన ద్రావిడ వర్గంలోని వీరుల్ని ఒక్కొక్కళ్ళనీ వధించుకుంటూ పోయి తనకిక డోకా లేదనుకుంటున్న శ్రీకృష్ణునికి ఉత్సాహం మిన్నుముట్టింది.

ఇక శ్రీకృష్ణుడు రాయబారం నిర్వహించిన తీరు చూద్దాం- దాయ భాగానికై సమర భేరి మ్రోగింది. కురుపాండవుల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థితికి తెచ్చాడు కృష్ణభగవానుడు! యుద్ధ విషయంలో ఆయన తంత్రం ఫలించింది. యుద్ధానికి ముందు సంధి తంతు నడిపాడు. సంధి చెడియుద్ధం జరిగితే తనకెంత లాభమో అంచనా వేసుకోవటం చేతగాని వాడేమీ కాదుగా శ్రీకృష్ణుడు - అందుకే వాళ్ళల్లో ఎవ్వరు గెల్చినా తనకూ, యాదవులకు అసలేమీ నష్టం వాటిల్లకుండా చూచుకున్నాడు.

సాత్యకి చేవితానులు తప్ప మిగత యాదవ వీరులేవ్వరూ పాండవుల తరపున యుద్ధం చెయ్యలేదు. కృతవర్మ, విందానవిందులు, నారాయణ, గోపాలురు దప్ప కౌరవపక్షాన యాదవ వీరులేవరూ లేరు. కురుపాండవ పక్షాలలోని వీరులందరూ చావటమే అతనికి కావలసింది. చచ్చీ చెడీగెల్చినవాళ్ళు కూడ ఎంత బలహీనంగా వుంటారో లెక్కలు కట్టాడు. అటువంటి బలహీనులకు తన చెప్పుచేతల్లో వుండక వేరే గత్యంతరం వుండదు కదా. కనుక యుద్ధం జరిగి తీరవలసిందే. అందుకేసంధిపొసగకుండా వుండేందుకు కావలసిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాడు. సంధి విషయంలో శ్రీకృష్ణుని మనసులోని మాటవిందామా? -

''సంధి నియమంబులను విన్న జగతి యెల్ల
బళి! బళీ!! యంచు శ్లాఘింపవలయు సంధి
కుదరకుండఁ బోవలయు లోకులకు రాజ
నీతి నైపుణిఁ జూపింపనేర్తునేఁడు.''

అంతేకాదు; సంధికని బయలుదేరబోయేముందు చెప్పిన మాటలు, భీముణ్ణి పురికొల్పిన తీరు, ద్రౌపదిని ఓదారుస్తూ వల్లించినసూక్తులు ఈయనఎటువంటి రాయబారియో ఎవరికయినా యిట్టే తెలిసిపోతుంది.

అందుకే నేటికీ ఎవరయినా ఏ రాయబారానికి బయలుదేరినా, సంజయ రాయబారమా లేక కృష్ణరాయబారమా అని చమత్కరిస్తూనే ఉంటారు. ''అయినను పోయి రావలయు హస్తినకు'' అని ముసిముసి నవ్వులు రువ్వుతూ రాయబారిగా వెళ్ళిన శ్రీకృష్ణుడు విడిది దిగింది ఎక్కడ? -

''ఎవని ధార్త రాష్ట్రుడు తన హృదయమందు
సతము లేశంబు నమ్మక సంచరించు
చుండి యొక కంటఁగని పెట్టి యుండునట్టి
విదురునింట శ్రీకృష్ణుండు విడిది దిగియె.''

కౌరవ సభలో సంధి విషయం ముచ్చటించే సందర్భంలో ఏం చేసాడు శ్రీకృష్ణుడు? పాండవుల్ని అలా పొగుడుకుంటూ పోవటం ఏమి సబబు? పోనీ అంతటితో ఆగిందా విషయం- కౌరవుల పొరపాట్లను గోరంతలు కొండంతలు చేసి అలా నిందిస్తాడా? ఈ ఫక్కీ సంధి కూర్చేందుకా? కూల్చేందుకా?!

ఇక సంధి నియమము చూద్దామా - అదీ అంతే.

'' ఐదూళ్ళే నడిగించెద
నైదూళ్ళను గూడ నీయనని కురుపతిచేఁ
గాదని పించెద గట్టిగ
నా దోసముఁగప్పి పుచ్చి నటియించెదనే''.

నాటకాలు ఏనాటికయినా బయట పడకుండా ఉంటాయా? శ్రీకృష్ణుడు అడిగిన ఐదూళ్ళు ఎటువంటివి? -

**వారణావతం** - ద్రుపదుడివద్దలాక్కొని ద్రోణునికిపాండవులుగురుదక్షిణగా సమర్పించుకొన్నది. కౌరవులూ పాండవులూ కలిసి యాదవులపై దండెత్తి వశం చేసుకున్నది. **మాకంది** - అది కూడ ద్రోణునికి గురుదక్షిణగా యిచ్చిందే. ఆ రెండూళ్ళూ ఆనాటికి ద్రోణుడి అనుభవంలో ఉన్నవే. యాదవుల ఆధీనంలో ఉన్న **కుశస్థలి** కర్ణుని వశమయ్యింది. అడిగిన ఐదూళ్ళలో అదీ ఒకటి. అది మళ్ళీ పాండవుల ద్వారా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలి. ఇలా ముఖ్యమైనవీ, రారాజును ఇరుకున పడవేసేవీ నాలుగూళ్ళు అడిగి ఐదోది నీ యిష్టం అని అందులో రాయితీ కల్పిస్తాడు!

సంధి చెడింది. శ్రీకృష్ణుని పథకం పారింది. ఇక యుద్ధం నడిపించిన తీరును తిలకిస్తే -

రణనీతి గంగ పాలయ్యింది. భూరిశ్రవుని వధ, ద్రోణవధ, కర్ణవధ, దుర్యోధనవధ అతిహేయాలనీ, నింద్యాలనీ, యుద్ధ నియమాలకు పూర్తిగా విరుద్ధాలనీ అందరూ అంగీకరించే విషయమే. ధర్మజుడుగెలిచాడు. కానీ పాండవులకు ఒరిగిందేముంది. లాభం అంతా శ్రీకృష్ణునకే.

కురుక్షేత్ర సంగ్రామం ముగిసింది. శ్రీకృష్ణుని వాక్కు వేదవాక్కు; ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ. యదువంశము వారిని పట్ట పగ్గాలు లేకపోయాయి. అది చివరకు యాదవ ప్రళయానికీ, జాతి పతనానికీ దారి తీసింది.

ద్వారకాపురం నిండా పానశాలలే. చీకులను అమ్మే అంగళ్ళే! ఎక్కడ చూచినా జారత్వమే. ఏకలవ్యుని వర్గంవాళ్ళు సమయంకోసం కాచుకొని ఉన్నారు. భరత వర్షాన్నంతా తన చెప్పు చేతల్లోకి తెచ్చుకోగలిగిన శ్రీకృష్ణునికి తనవంశం వాళ్ళకు మర్యాదగా మసలుకునేట్లు చెయ్యటం ఎలాగో తోచలేదు. నిర్వీర్యుడై మౌనంగా ఉండిపోయాడు. యదువంశం వారంతా ఒకళ్ళనొకళ్ళు కొట్టుకొని చంపుకున్నారు.

కట్టెదుటన్ గులక్షయము కల్గుట కాంచి దురంత వేదనా
ఘట్టిత మానసుండగు చుఁగన్నొలఁగాంచఁగ లేక దైవముం
దిట్టి సముద్ర తీరమును దించి సమీపము నందు నొక్కచో
దట్టపుఁ జెట్టు నీడఁగని దగ్గర కేగి పరున్నయంతటన్

అలా అమితమైన దుఃఖంతో శ్రీకృష్ణుడు ఒక చెట్టునీడన విశ్రాంతి తీసుకునే సమయంలో ఒక బోయ బాణం వేస్తే శ్రీకృష్ణుడు ప్రాణం వదిలాడు. దాదాపు 84 సంవత్సరాలు భరత ఖండాన్ని డేగాట ఆడించిన ఆ లీలా మానుష విగ్రహుడు, శ్రీకృష్ణుడు ఒకబోయవాని బాణం దెబ్బకు కాయం వదలటమా? ఏం చేస్తాం కాలమహిమ కాబోలు! అయినా అది కలికాలం కాదే - ద్వాపరయుగమేనే!

# కవిత్వము - సౌందర్యము

- డా.యు. ఎ. నరసింహమూర్తి

కవిత్వానికి సౌందర్యానికి మధ్యగల సంబంధాన్ని - రహస్యాన్ని శోధించి, విశ్లేషించి తేట పరచడానికి మన ప్రాచీనులు చేసిన ప్రయత్న సర్వస్వాన్ని మనం అలంకారశాస్త్రమని వ్యవహరిస్తున్నాము. సౌందర్యసంబంధమైన సూత్రాలను, మౌలిక సత్యాలను తేటపరచడానికి ప్రయత్నించే తాత్త్వికశాఖను పాశ్చాత్యులు Aesthetics అన్నారు. ఔత్తరాహులైన ఆధునిక విమర్శకులు అలంకారశాస్త్ర మనే అర్థంలో కావ్య శాస్త్రము - సౌందర్యశాస్త్రము అనే పదాలను వాడుక చేస్తున్నారు. ఈ వ్యవహారం ప్రాచీనుల సమ్మతి ననుసరించినదే. 'సౌందర్యమలంకారః' అనే వామనుని మాటను ఎవరూ కాదనలేదు. అందుచే అలంకార శాస్త్ర మనే అర్థంలో సౌందర్యశాస్త్రం అని వాడుక చేయడం సమంజసమే. మన అలంకారశాస్త్ర చరమలక్ష్యం కావ్య సౌందర్యాన్వేషణమే.

సౌందర్యానుభూతి అనిర్వచనీయమైనది. అది ఒక సిద్ధాంతానికి గాని, విశ్లేషణకుగాని, ఆచరణాత్మకమైన నిరూపణకుగాని లొంగేదికాదు. కాని అది మానవీయ భావభూమికలోని ఈ సీమలను సమన్వయపరచి, అతని మనసులో వాటికొక ఐక్యాన్ని సంఘటిస్తుందని W.D. Fcery వివరిస్తాడు.[1] "Beauty is the shining of the idea through matter" అనే టాల్‌స్టాయ్ నిర్వచనం వస్తుగతమైన భావప్రకాశమే సౌందర్యమని చెప్తుంది.[2] ఈ నిర్వచనం వివరణ సాపేక్షమైనది.

భారతీయులు రుచిర - చారు - సుషమా - సాధు - శోభ - కాంత - మనోరమ - రమణీయ - విచ్ఛిత్తి - రుచ్య - మనోజ్ఞ - మంజుల - లలిత - సుష్ఠు మొదలైన పదాలను సౌందర్య పర్యాయాలుగా వాడేరు. 'సుందరస్య భావమే సౌందర్యమ్' అని సౌందర్యశబ్ద వ్యుత్పత్తి చూపబడింది. శబ్దకల్పద్రుమంలో సౌందర్య లక్షణమిలా ఉద్ధృత మయింది.

'అంగ ప్రత్యంగకానాం యః సన్నివేశో యథోచితమ్,

సుశ్లిష్టః సంధిబంధః స్యాత్ తత్ సౌందర్యము దాహృతమ్॥ ( ఉజ్జ్వల నీలమణి)

సుశ్లిష్టము సంధిబాధయుతము అయిన అంగప్రత్యంగకముల యథోచిత సన్నివేశము కావ్యసౌందర్యమని పై శ్లోకం చెప్తుంది. శబ్దార్థ గుణాలంకారాదులు కావ్యగతములైన అంగప్రత్యంగకములు కాగా ఔచితీసమాయుక్తమైన వాని సన్నివేశము కావ్య సౌందర్యంగా భాసిస్తుందని భావము. టాల్‌స్టాయ్ చెప్పిన వస్తువులో భావప్రకాశనమనే సూక్ష్మాంశాన్ని ఈ వివరణలో మనం విశదంగా దర్శించవచ్చును.

సౌందర్యాతిరేక నిష్పత్తి కోసమే కవి కావ్యారంభం చేస్తాడని మహిమభట్టు వ్యక్తి వివేకంలో చెప్పేడు. వామనుడు సౌందర్యమే అలంకారమన్నాడు. అభినవగుప్తుడు సౌందర్యమే కావ్యాత్మ అని స్పష్టంచేసేడు. కూతుకుడు కవుల వాక్కులు నిరంతర రసోద్గార గర్భ సౌందర్య నిర్భరములని అన్నాడు. చమత్కారం లేనిదే కవిత్వమే కాదని క్షేమేంద్రుడంటే, ''సౌందర్యంచ చమత్కృత్యాధాయకత్వమే' అని జగన్నాథ పండితుడన్నాడు. ఈ విధంగా శతాబ్దాల తరబడి

కావ్యాత్మాగవేషణ చేసిన ఆలంకారికులందరూ అనంద పర్యవసాయియైన సౌందర్య పరిధిలో పరిభ్రమిస్తూ వస్తుతః సౌందర్యమే కావ్యతత్త్వ రహస్యమని వెల్లడించేరు. అందుచేత అలంకారశాస్త్రాన్ని సౌందర్యశాస్త్ర మనడం ఉచితమే.

అందరికీ నచ్చేదే అందమని భాసుడన్నాడు. సహజ సౌందర్యానికి అలంకరణ మక్కర లేదన్నాడు కాళిదాసు. గుణానికి అందమైన తొడుగు అక్కరలేదన్నాడు భారవి. చక్కనమ్మ చిక్కినా అందమే అనికూడా అన్నాడు. క్షణక్షణానికి కొత్తగా కనిపించేదే రమణీయత అన్నాడు మాఘుడు. అందం లేని పదార్థం అందమైన దానితో కలిస్తే అందంగా కనిపించడాన్ని ఆశ్రయసౌందర్యమన్నాడు భామహుడు.[3] ఇలాంటి అభిప్రాయాల్ని సమీక్షిస్తే సౌందర్యం వస్తుగతము - శిల్పసాధ్యము, రూపాత్మకవము - గుణాత్మకవము, క్షణికవము - శాశ్వతవము, ఇంద్రియగ్రాహ్యవము - అతీంద్రియగ్రాహ్యము, వ్యక్తిగతము - సామూహికము అయిన భేదాలను కలిగివుండ వచ్చునని తెలుస్తుంది.

ప్రపంచానికి మూలసిద్ధాంతమైన సమన్వితతత్వం లేదా సామాజస్యమే సౌందర్యాని కాదారమని, ఆ సామాజస్యమే ఔచిత్యమని డా. నగేంద్ర అభిప్రాయము[4]. సౌందర్యమే నూతనౌచిత్యమని కుంతకుడు వివరించేడు[5].

సౌందర్య భావన స్వచ్ఛమైనది, పరిపూర్ణంగా వ్యక్తిగతాభిరుచి ననుసరించేది కావడం వలన అది సంపూర్ణంగా మానసికమైన భావమని క్రిస్టఫర్‌కాడ్వెల్[6] అభిప్రాయము. సౌందర్య శాస్త్రం, సౌందర్యాన్ని సంక్షిప్తంగా నిర్వచించాడు గాని, వస్తువు లెలా ఉంటే అందంగా ఉంటాయన్న విషయాన్ని ప్రదర్శించడం గాని చేయలేదు. వస్తువుల ఆధరణం వాటి సుందరాకృతి మీద లేక సమన్వితత్వము మీద ఆధారపడి ఉంటుంది. ఈ సమ్మతి అనేది వ్యక్తిగతమైన విషయం గాని సామూహికమైనది కాదు. అందుకే లోకం మెచ్చిన తాజమహల్ అందాన్ని ఆల్డస్‌హక్స్‌లీ తిరస్కరించాడు. నోబెల్ పురస్కారాన్ని పొందిన గీతాంజలి సౌందర్యం శ్రీశ్రీ సమ్మతి కెక్కలేదు. శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదన్నా డాయన. అందుచేత సౌందర్యాని కొక ప్రమాణాన్ని నిర్ణయించడం సాధ్యంకాదు. ''అనాఘ్రాతం పుష్పమే'' అన్న కాళిదాసు దగ్గరనుండి '' ఆ గూని పిల్ల - సౌందర్య సరోవరపు నత్తగుల్ల' అన్న బైరాగి వరకు అభిరుచి భేదాన్ని బట్టి అందానికి ఎవరో ఒక భోక్త లభిస్తూనే ఉన్నాడు.

లోకమంతా ఒక సుందర సముద్రం. అందాన్ని నిరంతరం అనేక రూపాల వెదజల్లుతూంది ప్రపంచం మీద. ఏ కోణంనించైనా చూడనీ కీటకాలనుంచి గొప్పమేధావుల దాకా అనుభవిస్తున్నారు #\aul | #\ÄuM@Ük\[7]. A thing of beauty is a joy forever అన్నాడు Keats. ఈ భావనలు అందము దాని అనుభవము సార్వత్రికము - సార్వజనీనము - సార్వకాలికము అనే భావనను కలిగిస్తాయి. కాని అందంలోనూ - దాని అనుభవంలోనూ కూడా ఎన్నో అంతరువులున్నాయి. వెన్నెల ఇంట్లో పడితే తలుపేసుకునే వాళ్లని చూసి చలం విస్తుపోయాడు. ''దారికనుపట్టు వింత సౌందర్యలవము - వదలిపోలేరు చంపెడు దాక వీరు'' అని కృష్ణశాస్త్రి అసహ్యించుకున్నాడు. అందాన్ని గుర్తించలేని వారు, గుర్తించి లక్ష్యం చేయని వారు, గుర్తించికూడా మనఃపూర్ణంగా అనుభవించలేని వారు, ఆమూల చూడంగా ఆకళించుకోలేని వారు, ఆకళించుకుని

వెల్లడించలేని వారు, ఇముడ్చుకోలేక వెళ్లగక్కే వారు, తమలోనే ఇముడ్చుకుని మౌనంగా దానిని శాశ్వతానందంగా నిబంధించుకునేవారు - ఇలా అనేకులుంటారు.

లౌకిక సౌందర్యం - అలౌకిక సౌందర్యం అనే భేదం ఉంది. చంచలమైన - నశ్వరమైన సౌందర్యం నుండి అచంచలము అనశ్వరమైన అనుభవాన్ని పిండి అందరికీ అందించే శక్తి కవులది - కళాకారులది. అది అందరికీ అందేది కాదు. అభినవేశరహితమైనది - సర్వసాధారణమైనది కాదు. **"Beauty could never be banal and commonplace"** అన్న అభిప్రాయం ఈ అంశాన్నే వెల్లడిస్తుంది[8].

సౌందర్యం అందరికీ అందేదికాదు. దాని విశ్వరూపసాక్షాత్కారం కావాలంటే (శ్రీ శ్రీ) మాటల్లో చెప్పాలంటే 'చిరదీక్షా శిక్షా తపస్సమీక్షణం' కావాలి. ఈ మధ్యలో కవి ఎంతో మధనపడతాడు. **"Beauty is a pledge of the possible. A conformity between soul and nature"**[9] అంటాడు జార్జి శాంతాయన. ఆసమ్మతిని సాధించే దాకా కవి మధనం కొనసాగుతుంది. ఇతరులు చూడలేని దివ్య సౌందర్యాన్ని దర్శించడానికి కవులు ఈ లోకంలో పడిన వ్యథకు ప్రత్యామ్నాయంగా స్వర్గంలో వారికి ప్రత్యేకస్థానాలున్నాయన్నాడు **Baudolaire** తన **Benediction** అనేకవితలో. కాల్పనికావేశంలో కవి మస్తిష్కం స్వర్గద్వారపు తోరణమైనపుడు కవితా దివ్యరూప సందర్శనం అయినపుడు తన నుడిని సౌందర్యపు గుడిగా భావిస్తాడు కవి. కాని తన దర్శన సర్వస్వాన్ని మన కందించలేడు. తన నిశ్చల దృష్టినుండి జారిపోతూన్న స్వర్గపు అసమగ్ర ప్రతిమను, దాని ప్రతీకను మనముందుంచ గలడు. అందుకే సమగ్రతను సాధించగోరే కవి సాహసాభియానం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. అందుకే ఇంతవరకు ఏ ఒక్క యుగమూ తన తాత తండ్రులు సృష్టించిన సుందర వస్తుజాలంతో తృప్తిపడక నిరంతరం వినూత్న సౌందర్యాన్వేషణను కొనసాగిస్తూనే ఉంది. తన కోరికల మేరకు ఇతరమైన సృష్టిని కొనసాగిస్తూనే ఉంది. ఆ ప్రయత్నంలో తనకు వారసత్వంగా సంక్రమిస్తూన్న సౌందర్యసంప్రదాయాల కంటె భిన్నమైన సుందర స్వప్నాలను సృష్టించుకుంటూ ఉంది. అయితే ఈ కొత్త అందాలు పాత సొగసుల్ని తుడిచి పెట్టడం లేదు. దీనినే గురజాడ 'పాతకొత్తల మేలికలయిక 'క్రొమ్మెరూగులు చిమ్మగా' అని భావించేడు.

సౌందర్యం లౌకికం - అలౌకికం అని రెండు రకాలనుకుంటే వృక్షాలు, పర్వతాలు, నదులు, సరస్సులతో నిండిన ప్రకృతి చిత్రం నిజంగా అందంగా ఉందనిపిస్తే ఆ అందం దానిని ఊహించిన కవి దర్శనంలోనూ, దానిని గుర్తింప జేసే అతని వర్ణన సామర్థ్యంలోనూ ఉంటుంది. ప్రతిభ అంటే నూత్న కల్పనం కాదు. నూత్న దర్శనం నూత్న స్వీకరణం అన్నాడు **Baudolaire**[10]. అహంకార పరిత్యాగం చేసిన వారికి మాత్రమే ఈ దర్శనం లభిస్తుంది. అప్పుడు అనశ్వరమైన ఆ వాణికి కవి ఒక వాహిక కాగలడు. సృష్టికర్త తలపెట్టిన కార్యాన్ని తాను కొనసాగించగలడు. తాను అనుమతింపబడి అందుకున్న సౌందర్య రహస్యాలను అందరికీ వెల్లడి చేయగలడు. తాను శోధించిన సౌందర్య రహస్యాలను తనదైన జీవద్భాషలోనికి అనువర్తింప జేయగలడు. 'నీకరుణ నిట్లు పదస్థుడ నైతి' అన్న తిక్కనలో ఈ అహంకార పరిత్యాగమే కనిపిస్తుంది. అందుకే 'తను కావించిన సృష్టి దక్కోరుల చేతం గాదు' అని ప్రశంసపొందిన మహాకవి అయ్యాడు తిక్కన.

లౌకిక సౌందర్యాన్ని గూర్చి శోధించిన వారిలో కొందరు సౌందర్యం వస్తువులో ఉందంటున్నారు. ఇతరులు అది కవి దర్శనంలో ఉంటుందన్నారు. ఈ సందర్భంలో ప్రసిద్ధమైన ధనంజయుని శ్లోకం సహృదయామోదాన్ని పొందింది.

రమ్యం జుగుప్సిత ముదార మథాపి నీచం- ఉగ్రం ప్రసాది గహనం వికృతంచ వస్తు
యద్వాఽప్య వస్తుకవి భావక భావ్యమానం - తన్నాస్తి యన్నరసభావముపైతిలోకే॥

దశరూపకంలోని ఈ ప్రసిద్ధశ్లోకాన్ని ఉదాహరిస్తూ సన్నిధానం వారు దాని చెంతనే **"Poetry turns all things to loveliness. It exalts the beauty of that which is not beautiful and it adds beauty to that which is deformed"** అన్న **Shelley** మాటలను చేర్చారు.[11] పై శ్లోకాన్ని **Shelley** పూర్తిగా వివరిస్తూ సౌందర్య దర్శనంలో ప్రాచ్యపాశ్చాత్య దృక్పథంలోని సహమతిని వెల్లడిస్తుంది. శోభావేశం దొరికినా కవి రసనిర్దేశం చేస్తాడన్నాడు శ్రీశ్రీ. ''ఏడిచి ఎన్నాళ్లయినదీ యెద - అశ్రులు కను మోసలం దోడిచి ఎన్నినాళ్లయినదో?'' అని సుందరకావ్య నిర్మాణం చేయబోయే కవి అంటాడన్నాడు కృష్ణశాస్త్రి[12].

సౌందర్యం అగ్నిశిఖ. ఆ అగ్నిశిఖనుండి ప్రసరించే అలౌకిక ఘాతంతో కవి ఆవేశభరితుడౌతాడు. కాళిదాసు జననాంతర సౌహృదంగా సిద్ధాంతీకరించిన అబోధపూర్వమైన పర్యుత్సుకత్వమిదే[13]. రమ్యమైన వస్తువులను వీక్షించినపుడు, మధురములైన శబ్దములను వినినప్పుడు ఈ స్థితి కలుగుతుందని ఆకవి కులగురువన్నాడు. అతీవ్రచైతన్యం కొన్ని సందర్భాలలో అంతవరకు అందంగా పరిగణింపబడని కురూపము - దుఃఖము - వేదన వంటి వస్తువులను కూడా సౌందర్య నిర్భరములైన వస్తువులుగా కనిపించేటట్లుగా చేస్తుంది. 'కవి చూపు ఇతరుల చూపువంటిది కాదు. అది ముసుగొత్తిగించి చూస్తుంది; తొలిచి చూస్తుంది. వికారంలోపల దాగి ఉన్న సౌందర్యాన్ని పెల్లగించుకుని చూస్తుంది'' అన్న కృష్ణశాస్త్రి మాటలు పై అంశాన్నే వెల్లడిస్తున్నాయి[14].

నెత్తుటఁదోగినేల యెఱనింగి తెఱంగున నూడె నక్కుమా
రోత్తముఁడందుఁ జంద్రుక్రియ నొప్పె నితాయుధ ఖండ భూషణో
దాత్త మణి ప్రతానములు తారల చందమునొంది యందమై
యత్తఱి నుల్లసిల్లె వసుధాధిప చూపఱపిండు చూడ్కికిన్. (ద్రోణ.2.127.)

ఇలాంటి దర్శనాన్ని తిక్కన మాటల్లోనే చెప్పాలంటే 'దారుణ ప్రియదర్శనము' అనాలి. భారతంలో అత్యంత విషాదకరమైన సంఘటన అభిమన్యుని మరణం. అత్యంత భీభత్సభరితమైన సన్నివేశమూ అదే. జుగుప్సావహమైన శవాన్ని ఆహ్లాదకారియైన చంద్రునిగా భావించిన ఈ దర్శనం అనితర సాధ్యం. దర్శనం తనదే అయినా తిక్కన దానిని ''చూపఱపిండు చూడ్కి''గా మార్చేడు. 'చూపఱపిండు' అంటే ప్రేక్షక సముదాయము. ఇందులోని రహస్యాన్ని సహృదయులు ఆకళించుకోగలరు. ''సౌందర్యమలంకారః'' అని వామనుడన్నాడు. గుంటూరు శేషేంద్రశర్మ అభిప్రాయం ప్రకారం వస్తువు - భాష - సృష్టి అనే మూడింటిలో సృష్టి అనదగినది అలంకారం మాత్రమే. వస్తువు అలంకారంగా మారిపోవడమే కవిత్వమన్నా డాయన[15]. అంటే వస్తువు మరుగున

పడి అలంకారం మెరుగున పడుతుంది. అదే సౌందర్యమని ప్రాచీనుల మతం. 'కవిత్వం దృశ్యవస్తువుల్లో అదృశ్యవస్తువుల్ని చూసే నేత్ర విద్య'' అన్న శేషేంద్ర ఇక్కడ కనిపిస్తారు[16].

'నా నృషిః కురుతేకావ్యమే' అనేది ప్రసిద్ధమైన మాట. ఋషులను ద్రష్టలని అంటారు. గొప్పకళ తన నుండి అవిభాజ్యమైన ఆధ్యాత్మికావేశంలో మానవత్వాన్ని భౌతికప్రపంచపు సర్వసామాన్యక్లేశాలను అధిగమించి ఒక ఉన్నతిని పొందేలా చేస్తుంది. అటువంటి దర్శనాన్ని అందరికీ అందించేవారు ద్రష్టలు. ''తీగ విద్యుచ్ఛక్తిని ఇముడ్చుకోలేనప్పుడే వెలుగు కనిపిస్తుంది. వెలుగు కనిపించక పోయినా లోపలి శక్తిని గుర్తించడం చాలా కొద్ది మందికే తెలుస్తుంది'' అంటూ సౌందర్య దర్శనంలో సాధారణ కవులకు, ఋషులకు గల భేదాన్ని వివరించాడు చలం[17]. సత్య శివ సుందర స్వరూపుడైన ఆపరమాత్మను చేరుకోదలచిన ఇటువంటి అలౌకిక సౌందర్య దర్శనం కవి చరమలక్ష్యాన్ని ప్రతిఫలించేదిగా ఉంటుంది. అందుకే విశ్వనాథ.

''సౌందర్య మనునట్టి నాకు తెలిసిన సరుకు, నీనుండి
ఐందవ మృదు కలాహసన! సరఫరాయైనది స్వామి!'' అంటూ అతీంద్రియ సాధ్యమైన అలౌకిక సౌందర్య దర్శన రహస్యాన్ని వెల్లడి చేసేడు[18].

ఇతరకళలకంటే సంగీతానికి అతీంద్రియ సౌందర్యాభివ్యక్తి సామర్థ్యముందని Baudolaire అభిప్రాయం. మాటల కందని అందాన్ని సంగీతం అందిస్తుంది. "Music was the common speech of the mankind' అన్న Halfman మాట ఈ సందర్భంలో స్మరింపబడింది[19]. సంగీతం ప్రకృతి సహజమైన భాష. అది అజ్ఞాత ధ్వనులతో మనతో సూటిగా మాటలాడుతుంది. అతీంద్రియ సౌందర్య సాధనకు కృత్యాద్యవస్థలో కొట్టుకులాడే కవి ఆత్మ సంగీతం ద్వారా మాత్రమే తన చరమలక్ష్యాన్ని చేరుకోగలదని అందుకే పద్యం గానమైతే దాని పరిధి సువిశాల మౌతుందని Poe అభిప్రాయపడ్డాడు.[20] Poem is visible music అన్నాడు మలార్మే. వీరిద్దరూ అత్యాధునికులైనా ఈ అభిప్రాయం అతిసనాతనమైనది. అందుకే మన ఋషులు ఋక్కులను గానం చేసారు. ఛందస్సు వేదాంగ మయింది. వాల్మీకి రామాయణ గాన రహస్య మిది. నన్నయ తన అక్షరాలపై రమణీయతా ముద్ర వేసిన దిందుకే.

వాల్మీకి నుండి జాషువా దాకా మనకెందరో కవికోకిలలు మధురమధురాక్షరాలను వినిపించారు. కాని ఇటీవలి కవి ''కోకిలలము కాము మేము కాకములం కాకవులం[21] అని కఠోరశబ్దాలను వినిపిస్తూన్నప్పుడు "Only ancient things and stuff of dreams were beautiful" అన్న W.B.Yeats మనజ్ఞాపకాలలోనిలుస్తాడు[22]. జీవన వ్యాకులతలో కొట్టుమిట్టాడుతూ ''మనకి సౌందర్య సంగీతాలు అపరిచితాలు అస్పృశ్యాలు' అంటున్న శివారెడ్డి మనసులో మెదుల్తాడు[23].

అధోజ్ఞాపికలు :

1. W.D.Furry, A History of Literary Criticism in America, ""The Aesthetical Experience," P 122.
2. Tolstoy, what is art, P 100.

3. ''సర్వజన మనోభిరామం ఖలుసౌభాగ్యం'' స్వప్నవాసదత్త, 2వ అంకము.

''కిమివహి మధురాణాం మాడనం నాకృతీనామ్'' అభిజ్ఞాన శాకుంతలము, ద్వితీయామారి.

''సరమ్య మహార్యమపేక్షతే గుణం'' కిరాతార్జునీయము, 4-23.

''రమ్యాణాం వికృతిరపి శ్రియం తనోతి'' కిరాతార్జునీయము 7,5.

''క్షణే క్షణే యన్నవతా ముప్తితి తదేవ రూపం రమణీయకాయాః'' శిశుపాల వధ,4-17.

''కిఞ్చదాశ్ర సౌందర్యాద్దత్తే శోభా మసాధ్వపి - కాన్తావిలోచనన్యస్తం మలీమస మివాంజనమ్'' భామహాలంకారము 1-55.

క్రోడీకరణ : Dr. K. Krishna Murthy, Some Throughts on Indian Aesthetics and Literary Criticism, Prasaranga, University of Mysore, 1968.

4. డా. నగేంద్ర, భారతీయ సౌందర్యశాస్త్రకీ భూమికా,
5. కుంతకుడు, వక్రోక్తి జీవితము.
6. Critopher Caudwell, Further studies in dying culture, P. 82.
7. చలం, మ్యూజింగ్స్. P.374.
8. Emid Stcokie, Baudalaire, Fabor and Fabor, 24 Rcesseu square P 298
9. George Santayana, the sense of beauty, P 203.
10. Emid storkie, Baudolaire, P 228.
11. కావ్యాలంకార సంగ్రహము, శ్రీసన్నిధానం సూర్యనారాయణశాస్త్రి వ్యాఖ్య.
12. కృష్ణశాస్త్రి, వ్యాసావళి - 2, P 20.
13. కాళిదాసు, అభిజ్ఞానశాకుంతలము, పంచమాంకము.
14. కృష్ణశాస్త్రి, వ్యాసావళి - 1, P 33.
15, 16. గుంటూరు శేషేంద్ర శర్మ, కాలరేఖ, P 83, P 11
17. చలం, మ్యూజింగ్స్. P 185
18. విశ్వనాథ, విశ్వనాథ మధ్యాక్కరలు, సంతాన వేణుగోపాలశతకము.
19. Holfman quoted in, "Baudolaire' by Emid Storkie.
20. E.A.Poe, Poetic Principle.
21. ఆలూరి బైరాగి, ఆగమగీతి.
22. W.B.Yeats, Autobiographies, P 101.
23. కె. శివారెడ్డి, మోహనా! ఓమోహనా!, 'మీలోని'

# మిర్జాగాలిబు వ్యక్తిత్వం

## (మీర్జాగాలిబు ద్విశత జయంతి సందర్భంగా)

- సదాశివ

మిర్జాగాలిబ్ చాలా అబద్ధాలాడినాడు. ఉర్దూ సాహిత్యంలో అతని లేఖలకు ఎనలేని ప్రజాదరణ లభించింది. లేఖా రచనకు కొత్త ఒరవడి పెట్టినవాడు గాలిబ్. తన శిష్యులకు, మిత్రులకు, అభిమానులకు ఎన్నోలేఖలు రాసినాడు. వాటిలో చాలావరకు సంపుటాల్లో అచ్చయినవి. పలు తడవలు ప్రచురణ పొందినవి. పరిశోధకులింకా అతని లేఖల కోసం అన్వేషణ సాగిస్తూనే వున్నారు. ఆలేఖలు ఆత్మీయులతో మనుసులోని మాటను చెప్పుకున్నట్లుగా వుంటవి. ముఖాముఖి మాట్లాడినట్లుగా వుంటవి. ఆలేఖలే అతని వ్యక్తిత్వాన్ని పట్టి చూపేవి. అతని అంతరంగాన్ని ఆవిష్కరించేవి. ఆలేఖల్లో అతడు చాలా అబద్ధాలాడినాడు. ఒక లేఖలో చెప్పిన విషయం ఇంకో లేఖలో ఇంకోరకంగా వుంటుంది. కాబట్టి అతడు ఏలేఖలో చెప్పింది సత్యమో గ్రహించటం కష్టం.

కొందరు అతని కవిత్వాన్ని ఆధారంగా చేసుకొని అతని భావాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేసినారు. అది సరయిన పద్ధతి కాదు. అతని లేఖలను ఆధారంగా చేసుకొని అతని వ్యక్తిత్వాన్ని గ్రహించే ప్రయత్నం చేయటం సరైన పద్ధతి, అయితే ఆలేఖల్లో అతడు సత్యం చెప్పి నట్లుగా అనిపించదు. అతనికి సన్నిహితులైన వాళ్లు, అతని మాటలను విని తమరచనల్లో రాసిన వాళ్లు ఒకరకంగా రాయలేదు. ఒకరొక రీతిగా రాస్తే ఇంకొకరు ఇంకోరీతిగా రాసినారు. అంటే గాలిబ్ ఒకరితో ఒకమాట, ఇంకొకరితో ఇంకొక మాట చెప్పినాడని స్పష్టమవుతున్నది. ఎందుకలా చెప్పి వుంటాడు? ఈ ప్రశ్నకు సమాధానాన్ని ఆలోచించడానికి ముందు గాలిబ్‌లో వుండే ఒక లోపాన్ని గుర్తించటం అవసరం. అది లోపమే కావచ్చు. గుణమే కావచ్చు. అతడు తన వ్యక్తిత్వాన్ని అందరికంటే భిన్నంగా వుంచుకునే ప్రయత్నం చేసినాడు. పదుగురు నడిచిన బాటలో నడవటం అతనికి సమ్మతం కాదు.

ఉర్దూలో అక్షరాలకు కొన్ని సంఖ్యలున్నవి. ఉర్దూలోనే ఏమిటి అన్ని భాషల్లోనూ సంఖ్యలున్నాయి. ఆ సంఖ్యలు వచ్చే ఒక షేర్ చెప్తే అది ఒక విశిష్ట సందర్భాన్ని తెలిపే తేదీ, నెల, సంవత్సరం అవుతుంది. దాన్ని 'తారీఖ్' అంటారు. గాలిబ్ ఒక షేర్లో అప్రయత్నంగా గాలిబ్ ముర్ద్ అన్నాడు అంటే గాలిబ్ మరణించినాడని అర్థం. ఆమాటలోని అక్షరాలను కలిపితే 1276వ హిజ్రీ అవుతుంది. అంటే క్రీ.శ. 1859. అప్రయత్నంగా తన నోట వెళ్లిన ఆమాట లోని అక్షరాల సంఖ్యను గుణించి, ''నేను 1859వ సంIIలో చనిపోతాను.'' అని అందరికి రాసుకున్నాడు. బాగాప్రచారం చేసుకున్నాడు. ఆ సంవత్సరమే ఢిల్లీలో మహామారి వ్యాపించింది. చాలామంది చనిపోయినారు. గాలిబ్ చనిపోలేదు. మీర్ మహెదీ మజ్రూ అనే శిష్యుడు ''ఉస్తాద్! తమ తారీఖు తప్పింది. తాము క్షేమంగా వున్నందుకు మేమంతా సంతోషిస్తున్నా''మని రాసినాడు. దానికి జవాబుగా గాలిబ్ ఇలా రాసినాడు. ''నాతారీఖ్ తప్పలేదు. పదిమందిలో చావటం ఇష్టం లేక నేనే మరణాన్ని వాయిదా వేసుకున్నాను.''

ఇది గాలిబ్ ప్రవృత్తి.

ముసలి వాడయిం తర్వాత రెండు రోజుల కొక సారి గడ్డం గీసుకునే అలవాటు పాటించలేక పోయినాడు. ముణ్నాలుగు రోజులకు చీమగుడ్లలాగా తెల్లని వెం(టుకలు పొటమరించటం అతనికి అసహ్యంగా వుండేది. కాబట్టి గడ్డం పెంచుకున్నాడు. గడ్డము, మీసము, తెల్లని తల వెం(టుకలు ఆనాటి ఢిల్లీలోని మౌల్వీల కుండేవి.

ఆ మౌల్వీలలాగా ఉండటం ఇష్టం కాక గడ్డం పెంచిన నాడే తలగొరిగించుకున్నాడు. అయినా గడ్డాలూ మీసాలు మౌల్వీల లక్షణమే కాబట్టి పెరిగిన గడ్డాన్ని సూనికి కత్తెర వేయించుకున్నాడు. అంటే అతడు తన రూపురేఖలను, వేష భూషలను, ప్రవర్తనను పదుగురిలా కాక ప్రత్యేకంగా నిలుపుకునే ప్రయత్నం చేసే వాడని తాత్పర్యం. ఆదిలో అతడు రాసిన కవిత్వం అందరిలా కాక కఠిన పాకాన పడటానికి కారణంకూడా ఈ ప్రయత్నమే. అతనికి తన ఫారసీ భాషా పాండిత్యం పట్ల వల్లమాలిన అభిమానం. ఉర్దూలో కవిత చెప్పిన వాళ్లంతా ఫారసీలో పండితులే. వాళ్లందరు భారతదేశంలోని ఫారసీ విద్వాంసుల దగ్గర ఫారసీ భాషాసాహిత్యాలు నేర్చిన వాళ్లు. తాను ఫారసీ దేశం నుంచి వచ్చిన అబ్దుస్సమద్ అనే ఫారసీ విద్వాంసుని దగ్గర ఆగ్రాలోను ఢిల్లీలోను రెండు సంవత్సరాలు అసలైన ఫారసీ నేర్చినట్లు ప్రచారం చేసినాడు. అంటే తాను ఇక్కడి ఫారసీ విద్వాంసుల లాంటి వాడు కాడు. ఈ ప్రచారానికి రెండు కారణాలు. తనది గురువు లేని విద్యకాదని నిరూపించటం ఒక కారణం. తాను ఫారసీ దేశస్థుడైన ఫారసీ విద్వాంసుని వద్ద ఫారసీ నేర్చుకున్నానని ప్రచారం చేసుకోవటం ఇంకోకారణం. అసలు అబ్దుస్సమద్ అనే విద్వాంసుడు భారతదేశంలో రెండేళ్లు నివసించి నాడా? అని సాహిత్య పరిశోధకుల సందేహం. అంతటి వాడు ఆగ్రాలోను ఢిల్లీలోనూ వుంటే అప్పటి విద్వాంసులు అతని గురించి ఒక్క మాటయినా చెప్పకుండా వుంటారా? కాబట్టి ఇది తన ప్రత్యేకత నిలుపు కోవడం కోసం గాలిబ్ కావాలని చెప్పిన అబద్ధం. కొన్నాళ్ల తర్వాత గాలిబే ఒక శిష్యునికి జాబు రాస్తూ ''అబ్దుస్సమద్ నా సృష్టి.'' అని వెల్లడించినాడు. ఒకరిద్దరు విద్వాంసులు అబ్దుస్సమద్ అస్తిత్వాన్ని అంగీకరించినా అనేకులు పరిశోధించి అదినిజం కాదని నిర్ణయానికి వచ్చినారు.

ఉర్దూ కవులకు కలం పేర్లుంటాయి. ఒకే కలం పేరును ఇద్దరు ముగ్గురు కవులు వాడుకోవచ్చు - నేడు హైదరాబాద్ నగరంలోనే 'షోఖ్' అనే కలం పేరుగల ఇద్దరు పెద్ద కవులున్నారు. గాలిబ్ మొదట్లో అసద్ అనే కలం పేరుతో శ్రేష్ఠమైన గజల్లురాసినాడు. అవి అతని దీవాన్ (కావ్యసంకలనం) లో చేరిపోయినవి. ఢిల్లీలోనే ఒక ముషాయిరాలో ఒక సామాన్య కవి అసద్ అనే కలం పేరుతో పేలవమైన గజల్ వినిపించినాడు. ఆనాడు గాలిబు తన గజల్ వినిపించలేదు - మర్నాడే 'గాలిబు' అనే కలం పేరు ఎన్నుకున్నాడు. అంతటి పట్టింపు అతనికి తన ప్రత్యేకత నిలుపుకోవటం పట్ల.

అతని ప్రేమ వ్యవహారాన్ని గురించి కూడ కొందరు తమచరిత్రల్లో మంచి ప్రచారం చేసినారు. అతని ప్రేమ వృత్తాంతాన్ని సొహరాబ్ మోతీ తాను తీసిన 'మిర్జాగాలిబ్' అనే సినిమాకు ఇతి వృత్తంగా గ్రహించి నాడు. దానికి ఆధారాలంతగా లేవు. అతని దీవాన్‌లో ఒక మర్సియా (విషాద కవిత) వున్నది. ఎవరో ఒక ప్రేయసి మరణం పట్ల సంతాపం తెల్పుకున్నాడతడు. అందులో ఆమె ఊరు లేదు, ఒక పేరు లేదు. ఆమె అతని ప్రేయసి కావచ్చు - ఇంకెవరికో ప్రేయసి కావచ్చు అదొక ఆధారం.

ఇంకో ఆధారం ఒక శిష్యుని ప్రేయసి మరణించినప్పుడు అతన్ని ఓదారుస్తూ తన ప్రేమ

సంగతి చెప్పుకున్నాడు. అది సత్యమని రూఢిగా చెప్పలేము. మంచి ఉద్దేశంతోనే ఒక అబద్ధ మాడివుంటాడు గాలిబు. తరువాతి వాళ్లు అదంతా నిజంగా జరిగిన కథే అని కొన్ని కల్పనలు, ఊహలు చేర్చి చెప్పినారు.

17 సంవత్సరాల వయసు వచ్చేవరకు అతడు ఆగ్రాలో తన మాతామహునింట పెరిగినాడు. మాతా మహుడు జాగీర్దారు. కాబట్టి అతడు నవాబుల కుమారులకు ఆవశ్యకమైన కొన్ని వ్యసనాల కలవాటు పడ్డాడు. నవాబ్ జాదాలు తవాయిఫ్‌ల (నృత్యగానాలతో ముజ్రాలు చేసే వృత్తిగల వేశ్యలు - డోమ్నీలూ అలాటి వాళ్లే) కోఠాలమీదికి సంస్కారం (తెహ్‌జీబ్) నేర్చుకోవటానికి పంపబడే వాళ్లు. పడుచు వాళ్లలో గాలిబు అలా వెళ్లేవాడను కోవటం సత్యదూరం కాదు. ఎవరో ఒక డోమ్నీ అతన్నీ అతని కవితను అతిగా ప్రేమించి వుంటుంది. ముజ్రాలలో గాలిబు గజళ్లనే రాగయుక్తంగా పాడేది. గాలిబు తుర్కిస్థాన్‌కు చెందిన వాడు. కనుక గౌరవర్ణం గల ఆజాను బాహువు. స్ఫురద్రూపి. డోమ్నీ అతన్ని ప్రేమించటంలోనూ ఆశ్చర్యంలేదు. గాలిబు కూడా ఆమె ప్రేమను గుర్తించి వుంటాడు. వాళ్ల ప్రేమ వ్యవహారం పదుగురికి తెలియక ముందే ఆమె మరణించింది. ఇది ఊహమాత్రమే.

మిర్జాహాతిమల్ బేగ్ ప్రేయసి మరణించింది. అతన్ని ఇలా ఓదార్చినాడు గాలిబు తన లేఖలో, కొన్ని వాక్యాల అనువాదం చిత్తగించండి. ''కవులలో ఫిరదౌసీ, యోగులలో హసన్ బస్రా, ప్రేమించే వాళ్లలో మజ్నూ అగ్రగణ్యులు. కవి అయిన వాడు ఫిరదౌసీ అంతటి వాడు కావాలె. యోగి హసన్ బస్రాను పోలవలె- ప్రేమించేవాడు మజ్నూకు సాటి రావాలె. మజ్నూ కంటే నువ్వే ధన్యునివి - లైలా తన యింట మరణించింది. - నీ ప్రేయసి నీయింట మరణించింది. మొగల్ యువకులు ఎవరి ప్రేమలో చస్తారో తాము ప్రేమించిన వాళ్లను తమ ప్రేమలో చంపి వదులుతారు. నేనూమొగల్‌నే - యౌవనంలో నేనూ ఒక సుందరిని ప్రేమించి నాను - ఆమె నా ప్రేమలో చనిపోయింది. ఆ యిద్దరిని దేవుడు అనుగ్రహించుగాక. ప్రియా వియోగ దుఃఖితులమైన మనిద్దరిని దేవుడు దయజూచుగాక''.

ఇదండీ గాలిబు తన ప్రేమవృత్తాంతాన్ని వెల్లడించిన లేఖ - ఇందులో సత్యమెంతో కల్పనయెంతో తెలియదు. మిత్రున్ని ఓదార్చటానికి కల్పించిన కథ అయినా కావచ్చు - ఈలాటి అబద్ధాలు, పరాచికాలూ అతనికి అలవాటే.

గాలిబు తన లేఖల్లో చాల చోట్ల దేవుని ప్రసక్తి తెస్తాడు. దేవుని కోసం అతడు చేసిందేమీ లేదు. ముసల్మానుగా బ్రతికినాడు. నమాజు చదువలేదు. రోజాలు పాటించలేదు. ముసల్మానులు పరమపవిత్రంగా భావించే రమ్జాన్ నెలలోనూ మద్యపానం మానుకోలేదు.

మిర్జా ఖుర్బానలీ బేగ్‌కు ఇలారాసినాడు,

''నీ యోగక్షేమాలు తెలిసినవి. ప్రాణం వుంటేనే ప్రపంచంతో పని- దేవుని అనుగ్రహం మీద విశ్వాసం లేక పోవటం నాస్తికత (కుఫుర్) అనుబడుతుంది నేనైతే నాస్తికున్నయి నాను ఇస్లాం మతం ప్రకారం నాస్తికున్ని (కాఫిర్‌ను) కనుక క్షమించ బడతానన్న ఆశలేదు. నాకు ఇహములేదు. పరమూ లేదు - తీరి పోయింది - నువ్వుమాత్రం నాలాగా కాఫిరువు కాబోకు. మంచి ముసల్మానువుకా.''

మిర్జాగాలిబు మత మౌఢ్యాన్ని నిరసించే వాడే కాని నాస్తికుడు కాడు. అన్ని మతాలను గౌరవించేవాడు. మత దురభిమానం గల మౌల్వీలు కొందరతన్ని కాఫిరుగా గర్హించినా గౌసలీషా, కాలేషాల లాంటి యోగులతన్ని మహామానవుడుగా ఆదరించేవాళ్లు. గౌసలీషా ఆనాటి ముస్లిములకు ఆరాధ్యుడు. కాలేషా చక్రవర్తి బహాదుర్‌షా జఫర్‌కు ఆధ్యాత్మిక గురువు.

గాలిబు తాను బీదవాడైనా తన కంటే బీదవాళ్లను చూస్తే బాధపడేవాడు. ''అతనింటికి అర్థియైవచ్చిన వాళ్లెవరూ ఉత్తచేతుల వెళ్లలేదు.'' అని రాసినాడు హాల్. హాల్ గాలిబు శిష్యుడే కాక మొట్టమొదట అతని జీవిత చరిత్ర రాసిన వాడు కూడా.

చలికాలంలో మిర్జాగాలిబు శిష్యుడొకడు చౌక రకం చీటి గుడ్డతో తయారు చేసిన చొక్కా తొడుక్కొని వచ్చినాడు-బ్రతికి చెడ్డ వాడు - రాత్రిపూట చలికి తట్టుకోలేక పోతున్నాడు. అతని అహం దెబ్బతినకుండా అతనికి సహాయం చేయాలనుకున్నాడు గాలిబు - ''చూడబ్బాయి! ఈలాటి గుడ్డ ఢిల్లీలో దొరకదు - ఈ గుడ్డచొక్కా తొడుక్కోవాలని కోరికగా వున్నది - నీ చొక్కా యిస్తావా?'' అన్నాడు. ''ఇదెందుకు గురువు గారూ! క్రొత్త చొక్కా కుట్టించి పంపిస్తాను.'' అని మనవి చేసుకున్నాడా శిష్యుడు.'' తయారుగా చొక్కా వుంటే మళ్లీ కుట్టించి పంపించటమేమిటి? ఇదేనాకు కావాలె. ''అని అతని చొక్కాను తాను తీసుకొని తన చొక్కా తీసి అతనికిచ్చి నాడు. అది దూది నింపి కుట్టిన వేడి చొక్కా - విలువైంది కూడా.

'గాలిబు గర్విష్ఠి' అన్నారు కొందరు చరిత్ర కారులు. స్వాభిమానం కలవాడన్నారు మరి కొందరు. అభిమానం లేకుండా అడుక్కునే వాడనీ కొందరన్నారు. ఎవరన్నదీ అబద్ధం కాదు - గాలిబు ప్రవర్తనే అలా వుండేది.

ఒక ఫారసీ షేర్‌లో,
దహర్ గోయంద్ నదారద్ రవిషే - దానిషాదాద్
హమ దారద్ కె చూఁ గాలిబ్ హమ-దానే దారద్

అని చెప్పుకున్నాడు. ''వేత్తలూ, రసజ్ఞులూ ఈ కాలంలో లేరంటారు. ఎందుకులేరు? గాలిబున్నాడు గదా!'' అని భావం -

బహాదుర్ షా జఫర్‌కు రాసిన ఒక లేఖలో,

''తమ ఆశ్రితున్నయి నందుకు నేను గర్విస్తున్నాను - నేను తమ ఆస్థాన కవినైనందుకు తామూ గర్వించ వలె - తమ తాత షాహజహాన్ తన ఆస్థాన కవి కలీమ్‌ను వజ్రవైడూర్యాలతో తులదూచినాడట- నాకదేమీ వద్దు - కలీమ్ ఫారసీ కవితను, నా ఫారసీ కవితను తులనాత్మకంగా పరిశీలించి అభిప్రాయం చెప్పవలసిందిగా విద్వాంసులను ఆదేశిస్తే నాకదే చాలు.'' అని రాసినాడు. ఈ లేఖను ఉదాహరిస్తూ.

''మిర్జా సంగతి తెలియని వాళ్లు ఈ లేఖను చూచి అతనికి వల్లమాల్ని గర్వమనుకోవచ్చు. అతన్నెరిగి వున్న మేమలా అనుకోము- ఆనాటి మేధావులూ, విద్వాంసులూ అతన్ని గురించి ఎలా అభిప్రాయపడ్డారో అదే రాసినాడతడు.'' అంటాడు హాల్. హాల్ సామాన్యుడు కాడు - మహాకవే కాక ప్రామాణిక విమర్శకుడు కూడా.

చక్రవర్తికి సమర్పించిన ఒక వినతి పత్రంలో,
సౌపుష్త్‌సే హై పేషయే - ఆబా సిపహ్‌గిరీ
కుఛ్ షాయిరీ జరీయయె ఇజ్జత్ నహీముఝే

అన్నాడు. ''నూరు తరాల నుంచి మా పూర్వీకుల వృత్తి కత్తి పట్టటం - కవితారచన నాకు గర్వకారణం కాదు.'' అని భావం.

రెండు మాటల్లో ఎంతటి వ్యత్యాసమో గమనించండి.

దిల్లీ కాలేజీలో ఫారసీ అధ్యాపకుడు కావలసి వచ్చినాడు. గాలిబు కంటే గొప్ప అధ్యాపకుడెవడుంటాడు? దిన దినగండంగా గడిచే అతని జీవితానికో దిక్కు చూపినట్లవుతుందని అతని హితైషులొక అప్లికేషన్ పంపించినారు. ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది. విద్యాశాఖ కార్యదర్శి థామ్సన్ కార్యాలయం ముందు పల్లకీదిగి గేటు వేలుపలే పచార్లు చేస్తూ నిల్చున్నాడు గాలిబు. లోపలికి రావలసిందిగా పిలిచినారు బంట్రోతులు. ''నా స్వాగతాని కెవరూ రానిదే ఎలారాను?'' అన్నాడు గాలిబు- ''జాగీర్దారు గా వస్తే స్వాగత సత్కారాలు గాని అభ్యర్థిగా వచ్చి నప్పుడ దెలాకుదురుతుంది?'' అని నసిగి నాడు థామ్సన్.

''ప్రభుత్వోగ మంటే ప్రతిష్ఠాకరమనుకున్నాను కాని ఉన్న పరువు వూడే వుద్యోగ మెందుకు?'' అని గాలిబు పల్లకీ త్రిప్పుకొని ఇల్లు చేరుకున్నాడు.

వేలకువేలు కుమ్మరించే వాజిదలీషాదర్బారులో స్వాగతం చెప్పేవాళ్లుండరని వెళ్లలేదు. కవుల మీద కనక వర్షం కురిపించే రాజా చందూలాల్ హైదరాబాద్ సంస్థానానికి ఆహ్వానిస్తే అక్కడి వాళ్లకు తన కవిత రుచించ లేదని వెళ్లలేదు. వందరూపాయల కోసం రాంపూర్ నవాబు దగ్గరికి దేబరిస్తూ వెళ్లేవాడు.

శిష్యులకు, మిత్రులకు జాబులు రాస్తే చివర్న ''ఇట్లు కీర్తిశేషుడైన, బధిరుడైన, దీనుడైన, వ్యర్థుడైన గాలిబు'' అని రాసేవాడు. ఒక శిష్యుడు ''తమ చిరునామాలో మిర్జాగాలిబ్ అంటే సరిపోతోందా? మిర్జా అసదుల్లా బేగ్‌ఖాన్ గాలిబ్ అని రాయవలసి వుంటుందా?'' అని ప్రశ్నిస్తూ జాబు రాస్తే ''ఎలా రాసినా పరవాలేదు - నాకు నీజాబు చేరుతుంది - కాని చివర్న 'బహాదుర్' అని రాయటం మరిచి పోకు-'' అని జవాబు రాసినాడు.

ఏమను కోవాలె గాలిబును?

అతడు తుర్కిస్థానంలోని సల్జూఖీ రాజవంశానికి చెందినవాడు. జాగీర్దారు కొడుకు జాగీర్దారు మనుమడు - జాగీర్దారు అల్లుడు- చక్రవర్తి చేత మూడు బిరుదులతో సన్మానించబడిన వాడు. కంపెనీ సర్కారు గౌరవం పొందినవాడు. నవాబు మిర్జా అసదోల్లా బేగ్‌ఖాన్ గాలిబ్, నజముద్దౌలా, దబీరుల్ముల్క్, నిజామ్ జంగ్ - అతని పూర్తి పేరు. అంతటి అభి జాత్యం, అంత పెద్దపేరు, అన్ని బిరుదులున్నా ఆర్థికంగా అతి సామాన్యుడు. నికరమైన ఆదాయం లేని వాడు. సొంత యిల్లు లేని వాడు. సామాజిక స్థాయి వేరు; ఆర్థిక స్థాయి వేరయినప్పుడు స్వభావమూ, జీవిత విధానమూ ఇలా తికమకగానే వుంటుందేమో! మిర్జాగాలిబు వ్యక్తిత్వాన్ని గురించి మీరేమంటారో!

# స్వామి వివేకానందతో ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు

- టి. రవిచంద్

ప్రొఫెసర్ లక్ష్మీనరసు సుప్రసిద్ధ ఆంగ్ల గ్రంథం '' ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' ( ప్రథమ ముద్రణ 1907) గ్రంథానికి డా॥ అంబేద్కర్ 1948వ సంవత్సరంలో ప్రత్యేకంగా ఒక పీఠిక రాసి, బొంబాయిలోని థాకర్ అండ్ కంపెనీచే ప్రచురింపచేశారు. '' ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' ప్రథమ ముద్రణ జరిగేనాటికి (1907) డా॥అంబేద్కర్ బొంబాయి విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ పరీక్ష పాసయ్యారు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయిన దళిత విద్యార్థిని అభినందిస్తూ ప్రముఖ మరాఠీ సంఘసంస్కర్త, విల్సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణాజీ అర్జున్ కెలూస్కర్ ఆయన రచించిన ''భగవాన్ గౌతమబుద్ధ చరిత్ర'' ( మరాఠీ 1898)ను బహూకరించారు. ఆయనను ఈ పుస్తకం బాగా ప్రభావితం చేసింది. దీని ప్రభావం డా॥ అంబేద్కర్ తన జీవిత అంతిమదశలో రచించిన ''బుద్ధ అండ్ హిజ్ ధమ్మ'' (1956) పై కూడా ఉన్నట్లు కనిపిస్తుంది. ''సిద్ధార్థుడు ఎందుకు పరివ్రాజకుడయ్యాడు?'' అనే విషయంపై ఆయన తన గ్రంథంలో చేసిన నూతన సూత్రీకరణకు, సిద్ధాంతానికి తొలి ప్రేరణ బహుశా కృష్ణాజీ అర్జున్ కెలూస్కర్ గ్రంథమే కావచ్చని కొంతమంది పరిశోధకుల భావన. ఆ తర్వాత మతమార్పిడి (Conversion) గురించి దళిత ప్రజలతో చర్చించడానికి ఇయోలాలో 1936 ( జూన్ రెండో తేదీ) లో ఒక సభ జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించింది బి. వెంకట్రావు అనే ఆంధ్రుడు. ఆయన 'హైదరాబాదీ అంబేద్కర్'గా ప్రసిద్ధి చెందారు. పూనాలోని ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌లో కొంతకాలం పనిచేశారు. 1890 లో జన్మించి 1953లో మరణించిన బి. వెంకట్రావు అసలు పేరు బత్తుల ఆషయ్య, ఆనాటి డా॥ అంబేద్కర్ ఆంధ్రా అనుచరుల్లో నిజాయితీకి, త్యాగానికి ప్రతీక వెంకట్రావు. ఈ సభలోనే హిందూమతానికి సంబంధించిన అన్నిరకాల గుర్తుల్ని, జ్ఞాపకాల్ని విసర్జించాలని నిర్ణయించారు. ''హిందువుగా పుట్టాను; హిందువుగా మరణించనని'' డా॥ అంబేద్కర్ ప్రకటించారు. అప్పటి నుండి ఆయన బౌద్ధధర్మాన్ని తీవ్రంగా అధ్యయనం చేయడం ప్రారంభించారు. బౌద్ధ భిక్షువులతో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇటలీ దేశానికి చెందిన బౌద్ధ భిక్షువు లోకనాథ డా॥ అంబేద్కర్‌ను కలిసి మతమార్పిడి విషయమై చర్చించాడు. ఆయన హిందూమతాన్ని వదిలి బౌద్ధధర్మ దీక్ష తీసుకుంటారనే అభిప్రాయం దేశమంతటా వ్యాపించింది. ఈ పరిస్థితులలోనే ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు బౌద్ధ గ్రంథం '' ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' ( బౌద్ధసారం) ఆయన దృష్టికి వచ్చింది. ఈ గ్రంథం డా॥ అంబేద్కర్‌ను ఎంతగానో ప్రభావితం చేసింది. అప్పటికి అది రెండు ముద్రణలు పొందింది. కాని దాని ప్రతులు అందుబాటులో లేవు. ఎలాగయినా ఆ గ్రంథాన్ని తృతీయ ముద్రణగా తానే ప్రచురించాలని ఆయన నిర్ణయించుకున్నారు. 1935వ సంవత్సరంలో బర్మా భారతదేశం నుండి విడిపోయింది. బర్మా బౌద్ధులు భారతదేశంలో కొంతమందే మిగిలారు. బర్మా భారతదేశంలో అంతర్భాగంగా ఉన్నప్పుడు బౌద్ధమత ప్రభావం కొద్దిగానయినా భారతదేశంలో కనిపించేది. బర్మా విడిపోయిన తర్వాత ఆ కాస్త ప్రభావమూ అంతరించింది. '' ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' 1912వ సంవత్సరంలో ద్వితీయ ముద్రణ వెలువడినా 1938 నాటికి దాని ప్రతులు

లభించటం లేదు. అప్పటికే డా॥ అంబేద్కర్ దాని గురించి ఎంతో విని ఉన్నారు. అందువల్ల ఆ గ్రంథాన్ని ఎలాగయినా సంపాదించి ప్రచురించాలన్న ఆయన కోరిక 1948 నాటికి తీరింది. 1948లో ఈ గ్రంథానికి డా॥ అంబేద్కర్ స్వయంగా ఉత్తేజకరమైన పీఠిక ఒకటి రాసి బొంబాయిలోని థాకర్ అండ్ కంపెనీ వారిచేత ప్రచురింపచేశారు. ఈ గ్రంథ ప్రచురణ సమయంలో గ్రంథకర్తయైన ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసు జీవిత విశేషాల్ని సేకరించడానికి ఆయన చాలా శ్రమపడాల్సి వచ్చింది. ప్రొఫెసర్ లక్ష్మీనరసు పూర్వవిద్యార్థీ, జాతీయ కాంగ్రెసు నాయకుడైన డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య ద్వారా ఆయన జీవిత విశేషాలు తెలుసుకొని డా॥ అంబేద్కర్ '' ఎస్సెన్స్ ఆఫ్ బుద్ధిజం'' తృతీయ ముద్రణకు పీఠిక రచించారు. ఆ పీఠిక రచించి సరిగా ఇప్పటికి యాభై సంవత్సరాలయింది. 1938 నాటికే కాలగర్భంలో కలిసిపోయిన ప్రొఫెసర్ పి. లక్ష్మీనరసును డా॥ అంబేద్కర్ రాసిన అరుదైన ఈ పీఠిక బ్రతికించింది. ఈ సందర్భంగా డా॥ అంబేద్కర్ జీవితానికి సంబంధించిన ఒక ముఖ్యమైన విషయాన్ని పేర్కొనాల్సిన అవసరం ఉంది. ఈమధ్య ప్రముఖ పాత్రికేయుడు, హిందూమతవాది అరుణ్‌శౌరి డా॥ అంబేద్కర్‌పై వ్యక్తిగతమైన దాడిచేస్తూ **Worshipping False Gods** పేరుతో ఆంగ్లంలో ఒక గ్రంథం రచించారు. ఈ గ్రంథం మొత్తం కేవలం డా॥ అంబేద్కర్‌పై ద్వేషంతో రచించబడింది. దీనిలో అరుణ్‌శౌరి లేవనెత్తిన అనేక రాజకీయ, రాజ్యాంగ పరమైన విమర్శలకు చాలామంది దళిత మేధావులు మంచి సమాధానం చెప్పారు. అయితే నాకు తెలిసినంత వరకు డా॥ అంబేద్కర్ బౌద్ధధర్మాన్ని స్వీకరించడంపై ఆయన చేసిన విమర్శలకు ఎవరూ సమాధానం చెప్పలేదు. రాజకీయాంశాలకే పరిమితమయ్యారు. డా॥ అంబేద్కర్ బౌద్ధధర్మాన్ని స్వీకరించడాన్ని అరుణ్‌శౌరి ''అది కేవలం ఒక రాజకీయ చర్య''గా చిత్రించాడు. అంతేకాదు. డా॥ అంబేద్కర్ బౌద్ధానికీ, బుద్ధుడి జీవితానికీ, ఆయన బోధనలకు ఎటువంటి సంబంధం లేదన్నాడు. **"Ambedkar's conversion to Buddhism was merely a political act: his "Buddhism" had nothing to do with the teachings and the life of the Buddha"** (పే. 376). డా॥ అంబేద్కర్ జీవితాన్ని బాల్యం నుండి చివరిదశ వరకు వస్తుగతంగా పరిశీలించిన వారు ఆయన బౌద్ధధర్మాన్ని స్వీకరించడాన్ని కేవలం రాజకీయచర్య **(Political act)** గా చిత్రించలేరు. బౌద్ధధర్మ స్వీకారం వల్ల దళిత ప్రజలు రాజకీయమైన హక్కుల్ని త్యాగం చేయాల్సివచ్చినా వెనుకాడాల్సిన పనిలేదని డా॥ అంబేద్కర్ **"Why Go for Conversion?"** అనే ఉపన్యాసంలో 1936 లో బహిరంగంగా ప్రకటిస్తే మతమార్పిడిని కేవలం రాజకీయచర్యగా అరుణ్‌శౌరి చిత్రించడం ఆయన వక్రీకరణ విధానాన్ని తెలియచేస్తుంది. ఈ వ్యాసంలో పైన పేర్కొన్న విషయాలు డా॥ అంబేద్కర్ విద్యార్థి దశలోనే బౌద్ధంవైపు ఎలా ఆకర్షితుడయ్యాడో ఆధారాలతో సహా నిరూపిస్తున్నాయి. కృష్ణాజీ అర్జున్ కేలూస్కర్ నుండి ప్రొఫెసర్ లక్ష్మీనరసు వరకు గల ఆధునిక బౌద్ధ పండితుల రచనల్ని డా॥ అంబేద్కర్ నిశితంగా చదివారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల ఆయన రచించిన ఈ పీఠికను తెలుగులో ప్రచురిస్తే బాగుంటుందని భావిస్తున్న తరుణంలో మద్రాసు (చెన్నై) శ్రీరామకృష్ణ మఠం మేనేజరు, స్వామి జ్ఞానాదానంద నుండి జూన్ 5వ తేదీన ఒక ఉత్తరం వచ్చింది. ఇది చాలా ఆసక్తిదాయకంగా

ఉంది. ఇప్పటివరకు ప్రొఫెసర్ లక్ష్మీనరసు జీవిత పరిశోధకులకు తెలియని ఒక విషయాన్ని ఈ ఉత్తరం చెన్నైనుండి గుంటూరుకు మోసుకొచ్చింది. శ్రీరామకృష్ణమఠం వారు స్వామి వివేకానంద 1893 & 1897 మద్రాసు నగర పర్యటనపై పరిశోధన చేస్తున్నారని, ఈ పర్యటన సందర్భంలో స్వామి వివేకానంద, ప్రొఫెసర్ లక్ష్మీనరసుల మధ్య 1897 ఫిబ్రవరి 6 & 8 తేదీలలో వేదాంతదర్శనంపై ఉత్తేజకరమైన చర్చ జరిగిందని తెలియజేస్తూ, మీరు ప్రొఫెసర్ లక్ష్మీనరసుపై పరిశోధన చేశారని మద్రాసు క్రిస్టియన్ కళాశాల అసిస్టెంట్ లైబ్రేరియన్ తెలిపారని అందువల్ల మీరు ప్రొఫెసర్ లక్ష్మీనరసు జీవితాన్ని రేఖామాత్రంగా తెలుపగలరని ఆయన రాశారు. అంతేకాదు ప్రొఫెసర్ లక్ష్మీనరసు రచనల్లో ఎక్కడయినా స్వామి వివేకానందను గురించిన ప్రస్తావనలున్నా తెలుపమని కోరారు.

ఇప్పటివరకు నా అధ్యయనంలో స్వామి వివేకానందకు, ప్రొఫెసర్ లక్ష్మీనరసుకు పరచయమున్నట్లు తెలియలేదు. కాని '' ఎ స్టడీ ఆఫ్ క్యాస్ట్స్'' లో ఆయన రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందల వేదాంతదర్శనంపై చేసిన విమర్శ చదివాను. అంతకు మించి వారిద్దరి మధ్య జరిగిన ఆసక్తికరమైన ఈ చర్చ గురించి నా దృష్టికి రాలేదు. ప్రొఫెసర్ లక్ష్మీనరసుకు తమ జీవితకాలంలో మద్రాసు ప్రెసిడెన్సీలోని వివిధ సంస్కరణోద్యమాలకు చెందిన ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్నాయి. తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతి ఆయనను తమ రచనల్లో 'నాస్తిక మిత్రుడి'గా అభివర్ణించారు. సంప్రదాయ హిందూమతాన్ని అభిమానించేవారు సయితం ఆయన పాండిత్యానికి, మచ్చలేని మహోన్నత వ్యక్తిత్వానికి ముగ్ధులయ్యేవారని వివిధ రచయితల రాతల వల్ల తెలుస్తుంది. కాని ఆధునిక హిందూమతానికి ప్రతినిధియైన స్వామి వివేకానందతో వారి పరిచయం గురించి విన్న వెంటనే ఆశ్చర్యం కలిగించింది. ప్రొఫెసర్ లక్ష్మీనరసు తమ రచనల్లో స్వామి వివేకానంద ప్రచారం చేసిన వేదాంతదర్శనంపై కటువైన విమర్శలే చేశారు. వివేకానందుడు ప్రచారం చేసిన భావజాలం హిందూమతానికి సమర్థనాత్మక మైనదే కాని సంస్కరణాత్మకమైనది కాదని ఆయన అన్నారు. సంఘసంస్కరణ విషయంలో గురుశిష్యులిద్దరూ అంత ఆసక్తి కనబరచలేదని, కాలంచెల్లిన అశాస్త్రీయ భావాలైన కర్మ, పునర్జన్మను ప్రచారం చేశారని, పైగా వేదాంత బోధనలు ఆధునిక విజ్ఞానశాస్త్ర ప్రయోగ ఫలితాల్ని సమర్థిస్తున్నాయని కూడా చెప్పారని ప్రొఫెసర్ లక్ష్మీనరసు రాశారు. ఆధునిక సంఘసంస్కరణోద్యమాలు పాశ్చాత్య పద్ధతులకు అనుకరణలని, అందువల్ల వాటివల్ల ఈ దేశానికి ఉపయోగం లేదని కూడా స్వామి వివేకానంద భావించారని ప్రొఫెసర్ లక్ష్మీనరసు తెలిపారు. కులవ్యవస్థను, బాల్యవివాహాల్ని కుడా గురుశిష్యులు ఖండించలేదు. అయితే వేదాంతదర్శనంపై వారి మధ్య ప్రత్యక్షంగా జరిగిన చర్చ తప్పకుండా ఆసక్తికరమైనదే కాకుండా విజ్ఞానదాయకంగా కూడా ఉండి ఉంటుంది.

స్వామి వివేకానంద హిందూమత ప్రతినిధి. ప్రొఫెసర్ లక్ష్మీనరసు బౌద్ధధర్మ అభిమాని. స్వామి వివేకానంద ఒకవిధంగా వేదాంత, బౌద్ధదర్శనాల సమన్వయవాది. ఆయన థేరవాద బౌద్ధాన్ని మూల **(Original)** బౌద్ధంగా అంగీకరించరు. మహాయానులతో మాకెటువంటి (వేదాంతులకు) వివాదం లేదన్నారు. బౌద్ధం లేకుండా హిందూమతం మనజాలదని, హిందూ

మతం లేకుండా బౌద్ధం జీవించలేదని ఆయన ఉద్దేశం. బౌద్ధులు, బ్రాహ్మణులు ఎప్పుడయితే వేరయిపోయారో భారతదేశ పతనం కూడా అప్పుడే ప్రారంభమయిందని వివేకానందుడు ఆశ్చర్యకరమైన సూత్రీకరణ చేశారు. ప్రొఫెసర్ లక్ష్మినరసు బౌద్ధాన్ని హిందూమతానికి ప్రత్యామ్నాయంగా భావించి బౌద్ధధర్మాన్ని దక్షిణభారతదేశంలో పునరుద్ధరించారు. ఆయన బహిరంగంగా బౌద్ధమతం స్వీకరించి హిందూమతాన్ని ఛాలెంజి చేసిన వ్యక్తి. బౌద్ధ, బ్రాహ్మణ సిద్ధాంతాలు రెండూ పరస్పర విరుద్ధమైనవని, ఒకటి బ్రాహ్మణాధిపత్యంపై ఆధారపడితే, మరొకటి మానవాధిపత్యంపై ఆధారపడిందని ప్రొఫెసర్ లక్ష్మినరసు గట్టిగా విశ్వసించారు. తదనుగుణంగా ఉద్యమాన్ని నిర్మించి, రచనలు చేశారు. అటువంటి ఇద్దరు ఆధునిక మత ప్రతినిధుల మధ్య జరిగిన చర్చ తెలుసుకోదగింది.

స్వామి వివేకానంద చికాగో (అమెరికా) నగరం సందర్శించి భారతదేశం తిరిగివచ్చిన తర్వాత మద్రాసులో కొంతకాలం ఉన్నారు. వీరిద్దరి మధ్య చర్చ అప్పుడు జరిగింది. అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన ప్రపంచ మత మహాసభలో హిందూమత ప్రతినిధిగా పాల్గొని ప్రపంచ ప్రసిద్ధిపొంది, అక్కడి నుండి ఇంగ్లండు వెళ్ళి ఆ దేశంలో వేదాంత తత్వ ప్రచారం కావించి నాలుగు సంవత్సరాల తర్వాత భారతదేశం తిరిగివచ్చారు. ఆ సమయంలో ఆయన మద్రాసు నగరంలో తొమ్మిది రోజులున్నారు. ఈ తొమ్మిది రోజులు ఆయనను అనేకమంది ప్రముఖులు కలిశారు. అనేక మత, దార్శనిక విషయాలపై స్వామి వివేకానందతో ఆసక్తికరమైన చర్చలు జరిపారు. వాటిలో ఒకటి ప్రొఫెసర్ లక్ష్మినరసుతో వేదాంతదర్శనంపై జరిగిన చర్చ.

స్వామి జ్ఞానాదానంద నుండి ఉత్తరం అందిన వెంటనే నా దగ్గర ఉన్న ప్రొఫెసర్ లక్ష్మినరసుకు సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని, ఆయన ఛాయాచిత్రాన్ని (Photo) పంపాను. మరల శ్రీరామకృష్ణ మఠం నుండి మరో ఉత్తరం అందింది. దానితోబాటు ప్రొఫెసర్ లక్ష్మినరసు, స్వామి వివేకానందల మధ్య జరిగిన చర్చను పేర్కొన్న ఒక గ్రంథం నుండి కొన్ని ఉల్లేఖనలు ఉన్న భాగాల్ని పంపారు. ఈ ఉల్లేఖనలు స్వామి వివేకానంద, ప్రొఫెసర్ లక్ష్మినరసుల మధ్య జరిగిన చర్చను వివరంగా పేర్కొనలేదు. అందువల్ల ప్రస్తుతానికి ఈ సమాచారం వల్ల పెద్ద ప్రయోజనం లేకపోయినా, వారి మధ్య చర్చ ఎలా, ఏ విధంగా ప్రారంభమయిందో మాత్రం దీని ద్వారా గ్రహించడానికి అవకాశం ఉంది. అంతేకాదు. స్వామి వివేకానంద స్నేహితుడు, వేదాంత పండితుడు ప్రొఫెసర్ సుందరరామ అయ్యర్ ప్రొఫెసర్ లక్ష్మినరసు గురించి రాసిన నాలుగు వాక్యాల ద్వారా ఆనాటి సంప్రదాయవాదుల్లో సయితం ఆయనపై ఎటువంటి ఉన్నతాభిప్రాయాలున్నది గ్రహించగలం. 1897 ఫిబ్రవరి 8వ తేదీన జరిగిన సంఘటనను ప్రొఫెసర్ సుందరరామ అయ్యర్ రికార్డు చేశారు: **"At about noon Prof. P. Lakshmi Narasu - whom I have always esteemed as a gentleman of great learning and high character - came to the castle, accompanied by the late Mr. V.K. Ramaswamy Iyer. Mr. Lakshmi Narasu was a student of Science and an avowed Buddhist, but I did not know who his**

companion was". దాదాపు మధ్యాహ్నం వేళ ప్రొఫెసర్ లక్ష్మీనరసు కీ॥శే॥ ఎస్.కె. రామస్వామి అయ్యర్‌తో కలిసి కోటకు వచ్చారని, ప్రొఫెసర్ లక్ష్మీనరసును తానెప్పుడూ గొప్ప పాండిత్యం, ఉన్నత వ్యక్తిత్వం గల పెద్దమనిషిగా గౌరవించేవాడినని, ఆయన విజ్ఞానశాస్త్ర విద్యార్థి అని, నిబద్ధత కలిగిన బౌద్ధుడని, కాని ఆయనతో వచ్చిన ఆయన గురించి తనకేమీ తెలియదని రాశారు. ఈ మాటల వల్ల ప్రొఫెసర్ సుందరరామ అయ్యర్ దృష్టిలో ప్రొఫెసర్ లక్ష్మీనరసు ఎటువంటి వ్యక్తిత్వం గలవారో మన కర్థమవుతుంది. తన భావాలతో ఏకీభవించని వారిని కూడా ఆకట్టుకోగల గొప్ప పాండిత్యం ఉన్నత వ్యక్తిత్వం ప్రొఫెసర్ లక్ష్మీనరసుదని బోధపడుతుంది. ఈ రెండు లక్షణాలున్నవారే గొప్ప సంస్కర్తలు కాగలరు. మార్పుకు మార్గదర్శకులు కాగలరు. సమకాలిక ప్రగతిశీల ఉద్యమాలకు నాయకత్వం వహించేవారు ప్రొఫెసర్ లక్ష్మీనరసు జీవితం నుండి ఈ రెండు లక్షణాల్ని అనుసరించగలిగినప్పుడు సామాజిక మార్పుకు దోహదకారులు కాగలరు.

ప్రొఫెసర్ లక్ష్మీనరసు గురించి పైమాటలు రాసిన తర్వాత ప్రొఫెసర్ సుందరామ అయ్యర్ నాటి విశేషాల్ని ఇంకా ఇలా వివరించారు. ప్రొఫెసర్ లక్ష్మీనరసుతో పాటు కలిసివచ్చిన ఎస్.కె. రామస్వామి అయ్యర్ గురించి తర్వాత తెలుసుకున్నాని, ఆయన ''ది ఎవేకనర్ ఆఫ్ ఇండియా'' అనే పత్రిక సంపాదకుడని ఆయనే దాని ఏకైక రచయితని, ఆ పత్రిక కొంతకాలం క్రమరహితం **(irregularly)** గా వచ్చి ఆగిపోయిందని రాశారు. ఈ ఇద్దరు సందర్శకులు స్వామి వివేకానంద అమెరికాలో చేసిన మత ప్రచారం ఆయన ప్రోద్బలంతో మద్రాసులో నడుపుతున్న ''బ్రహ్మవాదిన్'', ''ప్రబుద్ధ భారత'' లాంటి పత్రికల వల్ల ప్రయోజనం లేదని, కొన్ని యుగాలుగా భారతదేశం గాఢనిద్రలో మునిగిపోయినట్టుగానే ఇప్పటికీ ఉందని, కాని మేము ప్రారంభించిన '' ఎవేకనర్ ఆఫ్ ఇండియా'' ప్రభావం అందుకు భిన్నంగా ఉందని భావించారని, నేను లోపలకు ప్రవేశించే సమయానికి ప్రొఫెసర్ లక్ష్మీనరసు సహచరుడు ఇలా అంటున్నాడని ''స్వామీజీ మాకు మతానికి, దర్శనానికి సంబంధించిన వివిధ విషయాలపై స్వేచ్ఛాపూరిత చర్చ కావాలని, ప్రత్యేకంగా వేదాంతదర్శనంపై కావాలని, దానిపై మాకు తీవ్రమైన అభ్యంతరాలున్నాయని'' ఆయన అన్నాడు. నన్ను స్వామీజి పిలిస్తే వెళ్ళి వారి ప్రక్క సీటుపై కూర్చున్నాను. అప్పుడు స్వామీజీ వెంటనే మామూలు చిరునవ్వుతో ఇలా అన్నారు. '' ఇక్కడ నా మిత్రుడు సుందరరామన్ ఉన్నారు. ఆయన జీవితాంత వేదాంతిగానే ఉన్నారు. ఆయన మీ వాదనల్ని ఎదుర్కొంటారు. ఆయనతో చెప్పండి''. ఈ మాటలు ఎస్.కె. రామస్వామికి బాగా కోపాన్ని తెప్పించాయి. ఆయన స్వామివైపు తిరిగి మేము మిమ్మల్ని కలవడానికి వచ్చాము. మరొకరెవర్నీ కాదన్నాడు. కాని స్వామీజీ సమాధానం చెప్పలేదు. ఇదీ 1897 ఫిబ్రవరి 8వ తేదీన స్వామీజీ ప్రొఫెసర్ లక్ష్మీనరసు మిత్రుడి మధ్య జరిగిన సంభాషణ. ఈ సంభాషణలో ప్రొఫెసర్ లక్ష్మీనరసు మౌనంగానే ఉన్నారు. ఆయన మిత్రుడు ఎస్.కె. రామస్వామి అయ్యర్ స్వామివివేకానందను ప్రత్యక్ష చర్చలోకి లాగడానికి ప్రయత్నించారు. కాని ఆయన వారికా అవకాశం ఇవ్వకుండా అందరు స్వామీజీల మాదిరే తప్పించుకున్నారనిపిస్తుంది. బహుశా దానిక్కారణం అంతకుముందు స్వామి వివేకానంద, ప్రొఫెసర్ లక్ష్మీనరసుల మధ్య

జరిగిన చర్చ కావచ్చు. 1897 ఫిబ్రవరి 6వ తేదీ స్వామి వివేకానంద, ప్రొఫెసర్ లక్ష్మీనరసుల మధ్య వేదాంత మూలసూత్రాలపై ఆసక్తికరమైన చర్చ జరిగినట్లు ''ది ఇండియన్ మిర్రర్''లో వచ్చిన ఒక వార్తాశకలాన్ని బట్టి అర్థమౌతుంది. నాటి సమావేశంలో స్వామి వివేకానందతో ప్రొఫెసర్ లక్ష్మీనరసు వేదాంత మూలసూత్రాలపై ఎగతాళి చేశారని రాశారు. దానికి స్వామి వివేకానంద శక్తివంతంగా సమాధానం చెప్పారని మాత్రమే వార్తాంశం. ఆ చర్చాపాఠమంతా పరిశోధనలో వెల్లడయితే కాని వారిద్దరి మధ్య జరిగిన నిజమైన చర్చ తెలియదు.

ఏది ఏమయినా ప్రొఫెసర్ లక్ష్మీనరసు జీవితంలో మరుగునపడ్డ ఇటువంటి ఉదంతాలెన్నో! అనితరసాధ్యమైన పాండిత్యం, అత్యుత్తమ వ్యక్తిత్వంతో ఆయన ఆనాటి అన్నివర్గాల, వర్ణాల ప్రముఖుల మన్ననలు పొందారని, వారిని తన వాదనాశక్తితో ఆలోచింపచేశారని ప్రస్తుతం వెల్లడయిన చిన్న ఘటన ద్వారా రుజువవుతుంది.

**సంప్రదించిన రచనలు:**


1. Dalits and the Democratic Revolution - Gail Omvedt, Sage Publications, New Delhi, 1994.
2. Dr. Babasaheb Ambedkar and the significance of his Movement (A Chronology) - compiled and edited by K.N. Kadam, Popular Prakashan, Bombay, 1991.
3. స్వామి జ్ఞానాదానంద రాసిన రెండు ఉత్తరాలు, తేదీలు : 05-06-98; 25-06-98, రామకృష్ణ మఠం, చెన్నై.
4. Swami Vivekananda (His Legacy and Life) - Swami Tapasyananda, Sri Rama Krishna Math, Chennai.
5. Life of Swami Vivekananda by His Eastern and Western Disciples, Vol. II, Advaita Ashram, Calcutta, 1979.
6. Buddha and His Message - Swami Vivekananda, Advaita Ashram, Calcutta, 1992.
7. A Study of Caste - Prof. P. Lakshmi Narasu, Asian Educational Services, New Delhi, 1988
8. Worshipping False Gods (Ambedkar and the facts which have been erased) - Arun Shourie, Harper Collins India, Delhi, 1998.532

# రస సృష్టిలో మోహం

- కొండపర్తి శేషగిరావు

కలువలూ

గులాబీలూ

మల్లెలూ

మందారాలూ.

అన్నీ అందమైన పూలే.

ఇన్ని అందాలలో ఒకదానిమీద అభిరుచి ఏర్పడాలంటే, దానిమీద మోహం కలగాలి.

ఆ మోహంలో నుంచి పుట్టుంది అభిరుచి అన్నది.

ఒకదానిమీద మోహం ఉన్నప్పుడే అభిరుచి కలుగుతున్నదో, లేక రుచి అన్నది అభిధలో ఉన్నప్పుడే మోహం అన్నది పుట్టూ ఉన్నదో మరి.

మోహం తీవ్రమైనప్పుడు అభిరుచి కలుగవచ్చు. అభిధల్లో రుచి ఉన్నా, దానిమీద మోహం లేకపోతే అభిరుచి అణిగిపోనూ వచ్చు.

కనుక అభిధలో ఉన్న రుచిని మోహం జ్వలింపజేస్తుంది. మోహం అన్నది ఉంటే హృదయంలో నుంచి అభిరుచి దానంతట అది పుట్టుకొస్తుంది.

మోహం నుంచి వచ్చిన అభిరుచి ఊరుకోదు. అది కాస్త తీవ్రమైతే, సృజనశీలతగల వాళ్లలో ఆమోహం వారిని ఎంతగానో ప్రేరేపించి నిలువనీయదు.

అప్పుడు ఆ ప్రేరణ మనిషిచేత కళాసృష్టిని చేయిస్తుంది.

కమ్మని కవితలనూ, మలయ మారుతరాగాలనూ, అందమైన విన్యాసాలనూ, రంగు రంగుల రూపాలనూ, లయలహొయల మూర్తులనూ రసజగత్తులో ఆ మోహము మానవునితో రసకళాసృష్టి చేయించి వాటిని ఆవిష్కరిస్తుంది.

అందుకుని రసహృదయంలో మోహం జనని. దాని వెనుక రససృష్టికి ప్రేరణ ప్రధానాలైన ద్రవీకరణా, ఆర్ద్రత, లాలిత్యమూ తీవ్రతా అన్నవి ఉంటాయి. మోహం అన్నది రసతత్వంలో స్రష్టను రూపొందించి, పెంచి పెద్దయ్యేలా చేస్తుంది. ఈ దశలోనే కళాసృజనకు కావలసిన రస నిర్మాణ దృష్టినంతా కాబోయే కళాస్రష్టకు తన స్తన్యంద్వారా అందిస్తూ ఎంతగానో తీర్చి దిద్దుతుంది మోహం.

కనుక రసతత్వంలో మాతృమూర్తియైన రసదృష్టి స్వభావంలో ప్రత్యక్షమైన ఈ మోహం లేకపోతే అసలు రసతత్వానికి అస్తిత్వమే అనుమానస్పదం అని అనిపిస్తుంది.

అందుకే మోహం అన్నది రసతత్వజగత్తులో జనని అనక తప్పదు అని అనిపిస్తుంది.

కళాకారుడు కళాసృష్టి చేయటంలో, కృషి చేస్తూ ఆ కళలో చమత్కార నిపుణతలను క్రమక్రమేణా పొందుతూ కొద్ది కొద్దిగా తన కళావ్యక్తిత్వాన్ని పొందుతూ ఉంటాడు.

పరిణతిని కొంతపొందిన తరువాత ఆ కథాకారునిలో కళా సృష్టి తన వ్యక్తిత్వంతో తండ్రిలా నిలబడుతుంది.

ఇలా తయరవుతాడు మోహం అన్న తల్లి ఒడిలో నుంచి కళా సృష్టిలోకి వచ్చి వ్యక్తిత్వాన్ని పొందిన లలితకళా సాధకుడు.

అప్పుడు కళాకారునిలోని సృష్టి, తననుండి అనేక రసకృతులను తీసి లోకానికి అందిస్తూ ఉంటుంది.

అందుకనే రసస్పష్టికి రసకృతుల మీద అంత మమత. రసకృతి రసస్పష్టికి బిడ్డలాంటిది. రసకృతికి రసస్పష్టి తండ్రిలాంటిది. ఈ రెంటికీ జన్మప్రదాయిని రసదృష్టిలోని మోహం. కనుకనే దృష్టీ - స్పష్టీ - కృతీ, అన్నవి ఎంతో రసరక్తి సంబంధాన్ని కలిగి, ఒక దానిని వీడి మరొకటి ఉండలేని మోహమయమై అవినాభావ సంబంధాన్ని కలిగి ఉన్నాయి.

ఈ అవినాభావ సంబంధం వలననే రస జగత్తులో గల హృదయ భాషలో అవి

మోహాన్ని రసదృష్టిగానూ తల్లిగానూ

స్రష్టను స్పష్టిగానూ తండ్రిగానూ

కృతిని కళాఖండముగానూ తనయిగానూ అయినాయి.

దానిని ప్రాచీనులు ఇలా అన్నారు.

'మతా మోహం పితాశిల్పీ

పుత్రాంశ్చ సర్వదేవతాః'

ఈ ప్రమాణం శిల్పశాస్త్రంలోనిదే అయినా, రసతత్వంలోని అన్ని కళలకూ అన్వయింప వీలయే విశాలతనూ విమలతనూ కలిగి ఉన్నది.

శిల్పానికి శిల్పి తండ్రి ఎలా అయ్యాడో; అలానే కవి కవితకూ, రాగానికి స్వరకర్తా, రూపానికి రూపకారుడు, విన్యాసాలకి నాట్యవేత్తా పితలే ఔతున్నారు.

కనుక ఓ రసకృతికి రస స్రష్ట తండ్రిలాంటి వాడు తనయలాంటి రసకృతికూడా ఒకోసారి జనని అవటానికి కూడా అవకాశముంది రసకృతికి. పరిణతి పొందిన ఓ రసకృతి ద్వారా కొందరు రసజ్ఞులు ప్రేరేపింపబడి రసస్పష్టి చేయటం కూడా కద్దు.

అందుకనే దృష్టినుండి స్పష్టి, స్పష్టినుండి కృతీ పుట్టూ ఉంది. ఆ రసకృతినుండి రసదృష్టి అన్నది రసజ్ఞత అన్న రూపంలో పుట్టూ ఉంది. అది మరో స్పష్టికి ప్రేరణగా కూడా అవ్వవచ్చు.

అందుకనే

దృష్టి

స్పష్టి

కృతి

అన్నవి తల్లీ - తండ్రి - తనయా ఔతున్నాయి రస తత్వంలో.

# చిరస్మరణీయమైన సినారె కవిత

- గోపగాని రవీందర్

భారతీయ సాహిత్యంలో అత్యున్నత పురస్కారం ''జ్ఞానపీఠ అవార్డు'' పొందిన ''సినారె'' సాహితీశోధకులకు, సాధకులకు సుపరిచితులే! సినారె కవిత్వానికి మానవసంబంధాల్లోని వైరుధ్యాల సంఘర్షణే ప్రాణవాయువుగా వుంది. సినారె ఇటీవల రాసిన ''మట్టి మనిషి ఆకాశం'' దీర్ఘకావ్యంలో మానవీకరణ పొందిన చైతన్య రూపానికి కవిత్వం నిదర్శనమని నిరూపించారు.

మట్టిని స్థలానికి, ఆకాశాన్ని కాలానికి ప్రతీకలుగా తీసుకొని స్థలానికి, కాలానికి మధ్య మనిషి సాగిస్తున్న జీవన సమర ప్రవాహాన్ని చిత్రీకరించటం దీర్ఘకావ్యం విశిష్టత. సినారె కలం రాల్చిన బహుపసందైన పదాల కూర్పులతో అక్షరాల రమ్యతతో సౌందర్యంగా అలంకరించబడిన కవిత చిరస్మరణీయంగా వుంది.

కవిత్వం కవి ఊహాగానం కాదు. సామాజిక జీవనం నుండి గళాన్ని కలంగా మార్చి వ్యక్తీకరించే ఒకానొక రూపం. మనిషి పొందే సకల అనుభవాలను పిండుకొని కవితా శిల్పానికి ప్రాణం పోస్తాడు కవి. మానవ సంబంధాల్లో విలువల పతనం, వ్యవస్థల మధ్య నిరంతరం ఘర్షణ, వర్గవర్ణ పోరాటాలు. మనుషుల మధ్య మానవత్వపు విలువల్ని కాలరాస్తున్న మత విజృంభణ దుశ్చర్యలు, పీడితులపై పీడకుల ఆధిపత్యా అహంకారాన్ని సహించని సినారె స్పందించకుండా వుండగలడా! అందుకే కవన కత్తితో పతనావస్థకు చేరుకున్న అమానవీకరణ విలువల్ని అమానుషత్వ చర్యల్ని ఖండఖండాలుగా కవిత్వంలో నరుకుతున్నాడు.

> ''మనిషీ బీజం మొలిచింది నిరంతర వృద్ధికోసం
> ఏ కళ్లైనా కోరుకోవలసింది
> వినాశనం కాదు వికాసం''... (....7 పేజీ)

మనిషి జీవితం సంఘంతో మిళితమైంది. సంఘ జీవితం మనుషుల ప్రవర్తనలతో రూపుదిద్దుకొంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆలోచనలు, ఆచరణలు ఎలా కొట్టుమిట్టాడు తున్నాయో సూక్ష్మపరిశీలన కావించే కవికి ప్రత్యక్షంగా కన్పిస్తాయి. హింసయొక్క వికృత రూపం గురించి కవిత్వంలో కలత చెందుతాడు కవి. సమస్త హింసావాదానికి సామాజిక పరిస్థితులు ఎంత కారణమో, స్వార్థంతో కూడిన మనస్సు కూడ అంతే కారణమంటూ చక్కని విశ్లేషణ ఈ కవిత్వ పంక్తుల్లో కన్పిస్తుంది.

> ''మనసుకోశంలో విషం బుసకొడితే
> మానవ సంబంధాలు మాత్రమే కాదు
> విచ్చుకున్న నిఖిల ప్రకృతీ వికలమైపోతుంది
> అమృతానికి గరళానికీ జన్మస్థలీ మనసే మరీ''... (53)

యుగయుగాల, తరతరాల మానవ జీవన కథ, మనిషి విజయాలకథ, అపజయాల కథ, ప్రకృతీ శక్తులతో మనిషి చేస్తున్న నిత్యసమర కథ, విరుద్ధశక్తుల మధ్య జరుగుతున్న సజీవ చిత్రీకరణ ఈ దీర్ఘకవితలో కన్పిస్తాయి. మనిషితో పాటు నిత్యసహచరి మృత్యువు! మనిషిని కబళిస్తుంది. కాని మానవ ఆశయాల్ని అణుమాత్రం కూడ కదల్చులేదని సినారె సగర్వంగా ప్రకటిస్తున్నాడు.

''అవయవాలు చస్తాయిగానీ ఆలోచనలు చావవు

.......................................

ఆశయాలు జీవించే వుంటాయి

కాలఫలకం మీద చెక్కిన సంచలనాక్షరాలై'' ...(59)

మనిషిపై విధించబడ్డ ఆంక్షల్ని, తోటి మనుషులపై ఏర్పరుచుకున్న శత్రు భావనల్ని, విశ్వాస రాహిత్యాన్ని, అపనమ్మకాల్ని పారద్రోలే వ్యవస్థ కావాలని సినారె ఆకాంక్ష! ''జీవితంలో కల్లోలాన్ని గుప్పిళ్ళతో వెదజల్లాలి కాని దుప్పటిలా కప్పుకోవద్దని'' హెచ్చరిస్తున్నాడు కవి. మనిషి శక్తి పరిస్థితులపై ప్రతిఘటించడంలోనే వుందని సినారె ప్రగాఢ విశ్వాసం! మానవ స్వభావంలోని సంకుచిత భావాల్ని, స్వార్థాల్ని, అపనమ్మకాల్ని విడవమని విశ్వాసంతో కూడిన మానవ వ్యవస్థకు స్వాగతం పలకమని మనిషిని అర్థిస్తున్నాడు సినారె! నరరూప విషజీవుల విచిత్ర దృశ్యమాలికలలో మానవత్వానికి అడ్రసు వుండదు. కవిగుండె ఆక్రోశించింది. ఈ పంక్తుల్ని కన్నది.

''కాపుగా నిలచే కంచెలు వంచనలకు మరిగి

పచ్చని చేలను కబళించినప్పుడు

నిప్పుల్లో ఉండాల్సిన ఆంక్షలు రంగులు మార్చి

అవకాశవాదాల ఊసరవెల్లులైనప్పుడు...'' (...69)

''విశ్వంభర'' యొక్క కొనసాగింపే ''మట్టిమనిషి ఆకాశం'' దీర్ఘకావ్యం. మనిషిని సినారె భూగోళమంతా ఊహించాడు. ప్రాంతాలు వేరైనా, భాషలు వేరైనా జీవితంలో పొందే అనుభూతులు ఘర్షణలు సార్వత్రీకం, సార్వజనీనం. విజ్ఞాన సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతితో మనిషి వేస్తున్న వెర్రికేకల్ని సరిచేసుకొమ్మని హెచ్చరిస్తున్నాడు కవి. అంతరిక్షంలో కూడ పెరిగిన పోటీ వ్యాపారతత్వాన్ని, ఆక్రమణ దురహంకారాన్ని నిరసిస్తున్నాడు కవి. విశ్వమంతా శాంతి సౌఖ్యాలతో నిండి వుండాలనే కాంక్షగల కవి సహజంగానే నేటి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తాడు.

''గ్రహాలను ముడివేయాలని చేసే విశ్వమర్మజ్ఞునికి

లక్ష్యరహితంగా జరిపే ప్రదర్శనమేమిటి''....(76)

మనిషిని కవిత్వ శిఖరంపై నిలబెట్టిన మహాకవులు గురజాడ, జాషువా, శ్రీశ్రీలు. వారి సరసన నిలబెట్టదగిన మరో మణిపూస సినారె! ఈ కావ్యంలో విభిన్న సిద్ధాంతాల ప్రతిబింబాలు కన్పిస్తాయి. మార్క్సిజం వుంది. సాపేక్ష సిద్ధాంతం వుంది. మానవతావాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం, దళితవాదం, స్త్రీవాదం, రాడికల్ భావాలు అన్నింటిని మిళితం చేసుకొని పురుడుపోసుకున్న కావ్యం ఇది! మానవుణ్ని వస్తువుగా గ్రహించి విశ్వవ్యాప్త విస్తృత నేపథ్యంలో రాయటం వలన కావ్యానికి శాశ్వత లక్షణం కలిగింది. జోసెఫ్ ఉడ్‌క్రబ్ అన్నట్టు **"Poetry is a report of some human experience ordered in terms of concepts involving a value judgment"** కనుకనే మానవత్వాన్ని, మానవతావాదాన్ని కవిత్వంతో ప్రజల్లో చైతన్యానికి పాటుపడుతున్న నిరంతర కవన శ్రమ ధారుని కృషి సఫలం ఐతీరు తుంది.

''నిత్య చైతన్యంలో నిలచే మనిషి

నిష్క్రమణలేని పాత్రధారి

నిఖిల విశ్వంభరా పురోగతుల

నియతిని కాపాడే సూత్రధారి''....(...102...)540

# న్యూట్రినోలకు ద్రవ్యరాశి

- నాగసూరి వేణుగోపాల్

మార్పు జీవలక్షణం అని అంటూ వుంటారు - నదిలో కొత్త నీరు వచ్చి చేరితే పాతనీరు పోతూవుంటే సౌందర్యం అంటూ చెబుతారు భావకులు!

నిత్యక్రియా శీలకమైన సైన్స్ పరిశోధనా రంగంలో ఎప్పటికప్పుడు కొత్త అంశాలు ఆవిష్కరించబడుతున్నాయి. అలా అవి రావడంతో అంతవరకు సమగ్రం అని భావించబడేవి కూడా మరో కొత్త దృక్కోణంలో కనబడతాయి. అంతేకాక దానికి సంబంధించి ఏ సిద్ధాంతాలు, సూత్రీకరణలు రూపొందించుకున్నామో అవి మారే అవకాశం కూడా వుంది.

19వ శతాబ్దం చివర దాకా భౌతిక శాస్త్ర పరిశోధన సంపూర్తి అనే భావన వుండేది. ఎందుకంటే యాంత్రిక శాస్త్రం **(Mechanics)**, ఉష్ణగతిక శాస్త్రం **(Thermodynamics)**, మెక్స్‌వెల్ విద్యుత్‌గతి శాస్త్రం **(Max Wellian Electrodynamics)** మొదలయిన సాంప్రదాయక భౌతికశాస్త్ర **(Classical Physics)** అంశాలు భౌతిక చర్యలను పూర్తిగా వివరించాయని భావించడం జరిగింది. అయితే 19వ శతాబ్దం చివర దృశ్యం మారిపోయింది. కాంతి తరంగ సిద్ధాంతం **(Wave Theory of light)** ప్రశ్నింపబడింది. ఎక్స్ కిరణాలు, రేడియో యాక్టివిటి, ఎలక్ట్రాన్ ఆవిష్కరణ, యిలా ఒకదాని తర్వాత మరొక సంచలన అంశాలు ఆవిష్కరించబడటం, వాటిని వివరించే దిశలో ఐన్‌స్టీన్ సాపేక్షతా సిద్ధాంతం, క్వాంటం మెకానిక్స్ వంటి కొత్త దృక్పథం గల సిద్ధాంతాలు ప్రతిపాదింపబడడం జరిగింది. వీటిని '' ఆధునిక భౌతిక శాస్త్రం'' **(Modern Physics)** గా పేర్కొంటారు. అయితే అలా ప్రతిపాదింపబడ్డ అంశాలు పరమోత్కృష్టమైనవి కాదు. తర్వాతకూడా కొత్త ఆవిష్కరణలు వస్తూనే వున్నాయి. పరిధి పెరుగుతూనే వుంది.

అటువంటి స్థాయి గల పరిశోధన యిటీవల ప్రకటించబడింది. న్యూట్రినో **(Neutrino)** అనే ఉపపరమాణు కణం **(Sub atomic particle)** గురించి యింత వరకు ద్రవ్యరాశి లేని దానిగా పరిగణించేవారు. అయితే జపాన్‌లోని తకాయమ **(Takayama)** నగరంలో జరిగిన శాస్త్రసదస్సులో ఈ సంచలన వార్తను ప్రకటించారు. దాదాపు 120 మంది శాస్త్రజ్ఞులు పాల్గొన్న ఈ సదస్సులో ప్రకటించబడ్డ అంశం అంతర్జాతీయంగా ప్రచారానికి నోచుకునేలాగా పత్రికలలో ప్రచురించబడింది. ఇంతవరకు ఎటువంటి స్పష్టమైన ఋజువులేని అంశం యిపుడు నిర్ధారణ జరగడంతో యింత ముఖ్యమైన అంశం అయ్యింది. దాంతో అటు ఫిజిక్స్ పుస్తకాలూ, యిటు అస్ట్రోనమి పుస్తకాలూ తిరగరాయాల్సిన అగత్యం ఏర్పడింది. వాస్తవానికి అంతటి పరిశోధన చేయాలని ప్రతిసైంటిస్టు అభిలషిస్తాడు!

న్యూట్రినో గురించి ముచ్చటించుకోవాలంటే 'రేడియో ధార్మికత' **(Radio activity)** గురించి అర్థం చేసుకోవాల్సి వుంటుంది. భారయుత మూలకాల కేంద్రకాలు చాలా అస్థిరంగా వుండడంతో అవి నిరంతరం విచ్ఛిన్నమవుతూవుంటాయి. అలా విచ్ఛిన్నం అవుతున్నపుడు ఆ కేంద్రకాలనుంచి ఆల్ఫా **(Alpha)**, బీటా **(Beta)**, గామా **(Gamma)** వికిరణం ఉద్గారమవుతుంది. వీటిలో మొదటి రెండూ కణాలు కాగా మూడవది కిరణాల సమ్మేళనం. ఆల్ఫాకణం అంటే హీలియం కేంద్రకమే! గామా కిరణాలయితే ఫోటాన్లు ( శక్తిపొట్లాలు)! ఇక రేడియో ధార్మికతలో చాలా సాధారణమైంది బీటాక్షయం **(Beta deccy)** అంటే రేడియో ధార్మిక మూలక కేంద్రకం నుంచి ఎలక్ట్రాన్

(Electron) లేదా పాజిట్రాన్ (Positron) విడుదలవడాన్ని బీటా క్షయం అంటారు. ఇది ఎలా సాధ్యమో చూద్దాం. చాలా అస్థిరమైన మూలక కేంద్రంలో న్యూట్రాన్ వున్నపుడు ఒక ఎలక్ట్రాన్, ఒక ప్రతి న్యూట్రినో (anti-neutrino) విడుదలయ్యి ప్రోటాన్(Proton) ఏర్పడటం ఒక విధంకాగా, రెండో విధంలో ప్రోటాను పాజిట్రాన్, న్యూట్రినోలను విడుదలచేసి న్యూట్రాను ఏర్పడటం ఈ బీటాక్షయంలో పరమాణుసంఖ్యలో ఒక యూనిట్ మారుతుంది కానీ, ద్రవ్యరాశి సంఖ్యలో మార్పు వుండదు.

ఈ బీటా క్షయాన్ని వివరించడానికి 1930లో పౌలి (Pauli) ఆవేశరహిత, భారరహిత లేదా చాలా స్వల్పమైన భారం గల ఉపపరమాణుకణం వుండే అవకాశం వుందని ప్రతి పాదించాడు. అందుకే దానిని ''లిటిల్ న్యూట్రల్ వన్'' (Little neutral one) అని అర్థం వచ్చేలా NEUTRINO అని పిలిచారు. న్యూట్రినోగా పిలువబడేది Neutrino, anti-neutrino లకు సాధారణంగా వాడబడేపేరు. ఫెర్మిసిద్ధాంతం ఆధారంగా న్యూట్రినో ద్రవ్యరాశిని లెక్కించే ప్రయత్నాలు జరిగాయి. ఈ న్యూట్రినో ద్రవ్యరాశి ఎలక్ట్రాన్ ద్రవ్యరాశిలో 0.05 శాతం వుంటుందనీ, కాబట్టి భారరహితంగా పరిశీలించారు. అదికూడా భారరహితంగా ఎందుకు లెక్కించారంటే దానికి తగిన ఆధారాలు స్పష్టంగా లేకపోవడమే కారణం.

ఇపుడు ప్రకటించబడిన పరిశోధన ఈ అవగాహనను మార్చి వేస్తోంది. దీని వల్ల కేంద్ర భౌతిక శాస్త్ర అవగాహన, లెక్కింపులు పూర్తిగా మారుతాయి. ఇక ఖగోళశాస్త్రం విషయానికివస్తే యింతవరకు తప్పిపోయినదిగా భావించబడిన ''కాంతిరహిత పదార్థం'' (dark matter) యిపుడు విశ్వాంతరాళంలో వుందనీ, దీని ద్రవ్యరాశి కనబడే నక్షత్రాలకన్నా అధికమనీ తెలుస్తోంది. జపాన్ పట్టణమయిన 'తకయామ' పట్టణం దగ్గర వున్న జింక్ గనులలో భూగర్భంలో వున్న ''ది సూపర్ కమియోకండె న్యూట్రినో అబ్జర్వేటరి'' (The Super - Kamiokahde neutrino observatores) లో 47.3 లీటర్ల స్టెయిన్‌లెస్ స్టీలు ట్యాంకు వుంది. ఇది యావత్ ప్రపంచం లోనే చాలా సున్నితమయిన పరికరంగా గుర్తించబడింది. అంతేకాక ఈ ప్రయోగాలు చేస్తున్న శాస్త్రవేత్తలు కూడా చాలా జాగ్రత్తగా ప్రయోగాలు చేసేవారుగా పేరుగాంచారు. హవాయి విశ్వవిద్యాలయం ఫిజిక్స్ సైంటిస్టు జాన్ లర్నెడ్ (John Learned) దీని గురించి చెబుతూ ''మన మొహం మీద పెద్ద చేప ఎగిరిపడ్డట్టు'' గమనించడం జరిగిందన్నాడు. అయినా ఈ ప్రయోగంలో గణింపు పరోక్షమే! కాంతికి సంబంధించిన ఫ్లాష్ ఎందుకంటే దానికి న్యూట్రినో, వీటి అణువుల మధ్య జరిగే అభిఘాతాలే (Collisions) కారణం. అదికూడా మ్యాయాన్ న్యూట్రినో (Minon Neutrion) లతో పోలిస్తే తక్కువే. ఎందుకంటే వాటిలో కొన్ని టన్ న్యూట్రినో (Tan neutrino) లుగా మారడమే కారణం. ఆర్కేన్ (Arcane) సిద్ధాంతం ప్రకారం యిది సాధ్యమయిందంటే న్యూట్రినోకు ద్రవ్యరాశి వుండాలి.

ఈ విశ్వంలో కోట్లాది న్యూట్రినోలు వుంటాయి. వాటిలో లెక్కకుమించి ప్రతి సెకెను మానవ శరీరాన్ని తాకుతూవుంటాయి. అయితే ఎటువంటి ప్రమాదం లేదు. ఈ న్యూట్రినోలకున్న గురుత్వాకర్షణ వల్ల ఈ విశ్వం వ్యాకోచం రేటు తగ్గుతుంది. లేదా సంకోచింపచేయవచ్చు. అంటే 'బిగ్ బ్యాంగ్' (Big Bang) ఆలస్యం కావడంగానీ, లేదా ''బిగ్ క్రంచ్'' (Big Crunch) సాధ్యం గాని కావచ్చు.

ఈ ప్రయోగం జరిగిన తకయామ పట్టణానికి దగ్గర హిడా (Hida) అనే 17వ శతాబ్దపు

గ్రామం వుంది. బుద్ధుని బోధలా ధారంగా బుద్ధుడు ఏ అవతారమయిన ధరించగలడనే నమ్మకం అక్కడవుంది. ఈ అవగాహన సాయంతో న్యూట్రినో కణాల మార్పిడి గురించి సరిగా అర్థం చేసుకోగలిగామని జపాన్ శాస్త్రవేత్తలంటున్నారు. ఇంతవరకు న్యూట్రినోకు ద్రవ్యరాశి లేదని, కేవలం స్పిన్‌లో సవ్య దిశ న్యూట్రినోలే కాక అపసవ్య స్పిన్ కూడా సాధ్యమని తేలుతోంది. అంతే కాక మ్యూయన్ న్యూట్రినోలు కొంత దూరం డోలనాలు (Oscillations) చేసి మరోరకపు న్యూటినోలుగా మారుతాయి. కాంతి డోలనాలకు గురయితే ఎటువంటి మార్పులకు లోనవుతుందో యిక్కడ న్యూట్రినోలు కూడా అటువంటి మార్పులకు గురవుతాయి.

---

12. Does the thought of growing old :
(a) frighten you (b) remind you not to keep putting off things until tomorrow (c) depress you (d) seldom cross your mind?

13. If you felt like spending most of a day in bed, would it seem :
(a) unacceptably indulgent (b) too lazy (c) too time - wasting (d) okay — your free time is your own?

14. What most often curbs your more extravagant impulses :
(a) your bank balance (b) other priorities (c) what your partner would say (d) your feelings of guilt if you spend a lot on yourself?

15. Do you think feeling angry is :
(a) wrong (b) bad of you (c) normal (d) healthy?

NOW ADD UP YOUR SCORE

| | (a) | (b) | (c) | (d) |
|---|---|---|---|---|
| 1. | 15 | 10 | 5 | 0 |
| 2. | 0 | 5 | 10 | 15 |
| 3. | 0 | 10 | 5 | 15 |
| 4. | 15 | 10 | 5 | 0 |
| 5. | 15 | 10 | 5 | 0 |
| 6. | 5 | 10 | 15 | 0 |
| 7. | 15 | 10 | 5 | 0 |
| 8. | 10 | 15 | 5 | 0 |
| 9. | 15 | 0 | 10 | 5 |
| 10. | 0 | 10 | 5 | — |
| 11. | 0 | 10 | 5 | 15 |
| 12. | 0 | 10 | 5 | 15 |
| 13. | 0 | 5 | 10 | 15 |
| 14. | 15 | 10 | 5 | 0 |
| 15. | 0 | 5 | 10 | 15 |

**WHAT YOUR SCORE MEANS :**

0-70 : With yourself for a friend, you don't need enemies. You are much too hard on yourself — you don't think you matter enough, and you don't feel worthy of love and respect. You are wrong. Your low opinion of yourself makes it hard for you to change, but not impossible.

So go on and do it — make friends with yourself. You'll feel a lot better.

75-145 : You know you matter. You and yourself have your relationship reasonably well worked out, though you could sometimes be a better friend to yourself without having to try too hard. All you need to do is to give yourself permission.

150-200 : You are you own best friend and no mistake. That is positive —but it can have a negative side too. That applies particularly to anyone who got a score of 200 or more. It is perfectly okay, and even beneficial, to like yourself and treat yourself as your own best friend. But you have to take care not to lose sight of the fact that there are other people out there, too, whose interests deserve some consideration. Spare them a thought sometimes' — or risk ending up being your only friend.

**— Asia Features.**

## నాలుగో అట్టమీద బొమ్మ గురించి.

కళను ఎవరూ జీవన్మరణ సమస్యగా భావించరు. కాని హిట్లర్ కాలంలో (1930-40)లలో చాలా మంది జర్మన్, యూరోపియన్ కళాకారులకు అది జీవన్మరణ సమస్యే అయింది. జర్మన్ నీతికి, జర్మన్ జాతి ఆర్యజాతి అనే విషయాలకు సరిపడని చిత్రాలను చిత్రించే ఏ కళాకారుడినైనా బహిష్కరించాల్సిందే అన్నాడు హిట్లర్. హిట్లర్ మాటల్లో చెప్పాలంటే, ''అటువంటి కళాకారుల భయంకర 'దృష్టి విరూపణం' తరవాతి తరానికి వారసత్వంగా రావడానికి వీలులేదు. ఆధునిక కళ కళంకితమైపోయింది. ఆధునిక చిత్రకారులు దానిని దిగజార్చారు. అందుకని వారిని ఐరోపానుంచి, జర్మనీ నుంచి తరిమికొట్టవలసిందే,'' అన్నాడు హిట్లర్. అరవై సంవత్సరాల క్రితం నాజీ జర్మనీ అభివ్యక్తవాదం **(expressionism)** అంటే నొసలు చిట్లించింది. క్యూబిజమ్‌ను ఒక హెచ్చరికగా చూసింది. కళను సామాజిక విమర్శగా వాడడానికి వీలులేదంది.

హిట్లర్ సైన్యం ఐరోపా రష్యాలను దున్నినప్పుడు, మార్క్ షాగల్, పాల్‌క్లే, మాక్స్ బెక్‌మన్, ఫెర్డినాండ్ లెగర్ మొదలైన కళాకారులంతా ప్రాణాలు గుప్పెట్లోపెట్టుకొని బ్రతికారు.

రష్యాకు చెందిన మార్క్ షాగల్ హిట్లర్‌ను చూసి భయపడడానికి రెండు కారణాలున్నాయి: ఒకటి అతడు యూదు. యూదులంటే హిట్లర్‌కు మంట. రెండు అతనిని హిట్లర్ ''దిగజారిన'' వ్యక్తిగా చూశాడు. అజ్ఞాతంగా ఇతడు ఫ్రాన్స్‌కు పారిపోయాడు. నాలుగో అట్టమీది ''క్రీస్తు శిలువ'' చిత్రం మార్క్ షాగల్‌ది.

MISIMI/మిసిమి RNI Regd. No. 45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No. H/SD/191.



*Yellow Crucification by the Russian artist Marc Chagall*